మంగళవారం
3-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 252
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
పోస్టర్లు
పాంప్లెట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

తెలంగాణ పునర్నిర్మాణం

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే అజెండా

- పదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం
- మహిళలను కోటీశ్వరులుగా మార్చాలన్నదే సంకల్పం
- ఏడాదిలోపే రైతు రుణమాఫీ
- ఆవిర్భావ దినోత్సవంలో రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: గడిచిన పదేళ్లలో ధ్వంసమైన వ్యవస్థల పునర్నిర్మాణం దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ అజెండా అని పేర్కొన్నారు. నిర్వీర్యమైన వ్యవస్థలను గాడిలో పెట్టడం అంత సులువు కాదని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం తెలంగాణ అవిర్భావ దినోత్సవం జరిగింది. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తొలుత తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. సీఎం మాట్లాడుతూ... విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మహిళలు, మేధావులు, కవులు, కళాకారులు, సకలజనులు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చుకున్న రోజు అని, ఇది మనందరం గర్వించదగిన రోజు అని పేర్కొన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ... తెలంగాణ కలను నిజం చేసిన సోనియగాంధీకి కృతజ్ఞతలు చెప్పారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం దశాబ్దాలుగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, కాని రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. అందుకే పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని వివరించారు. తాము బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అప్పటి నుంచే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నం మొదలు పెట్టామని చెప్పారు. తప్పిదాలను సరిదిద్ది రాష్ట్రాన్ని గాడిన పెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలనే అజెండాగా తెలంగాణ పునర్నిర్మాణం దిశగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. నిర్లక్ష్యానికి గురైన యూనివర్సిటీలకు వీసీలను నియమించడంతో పాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యా కమిషన్, వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసుకుని సమాచార కమిషనర్లను, లోకాయుక్త, ఆర్‌టీఐ సభ్యులను నియమించుకుని, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే సంకల్పంతో వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తొలి ఏడాదిలోనే రూ. 21 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు, ఆ బస్సులకు వారిని యజమానులుగా మార్చామన్నారు. రైతు సంక్షేమం కోసం రూ. 20,617కోట్ల రుణమాఫీ చేయడంతో పాటు రూ. 15,333 కోట్లతో రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ. 12వేలకు పెంచామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబానికి ఏడాదికి రూ. 12వేలు అందిస్తున్నట్లు వెల్లడించారు. వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌ను ఇస్తున్నామని, ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోళ్లు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా భూ భారతి-2025 చట్టాన్ని తీసుకువచ్చి, భూ హక్కుల రికార్డులు పక్కాగా నిర్వహించి, భూ యజమానులకు భరోసా కల్పించడంతో పాటు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన16నెలల్లోనే 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి, నియామక పత్రాలను అందించామన్నారు. డీఎస్సీ ప్రకటించి 10వేల మందికి పైగా ఉపాధ్యాయులను నియమించామన్నారు. అంతర్జాతీయ పెట్టుబడులతో ప్రైవేట్ రంగంలో లక్ష మందికి ఉద్యోగ

- మిగతా 2 లో

9 మంది ఉద్యమకారులకు నగదు పురస్కారం

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మందికి కోటి రూపాయల నగదు పురస్కారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల గుండెల్లో నిలిచిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు తొమ్మిది మందికి నగదు పురస్కారం అందిస్తామని తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజున ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా వారికి నగదు పురస్కారం అందించారు. ఎక్కా యాదగిరి రావు, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరికి పురస్కారాన్ని అందించగా, దివంగత గూడ అంజయ్య, గద్దర్ కుటుంబసభ్యులకు చెక్కులను అందజేశారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరటి వెంకన్న తరపున ఆయన కుమార్తె పురస్కారాన్ని అందుకున్నారు.

వామపక్ష, ప్రగతిశీల, లౌకిక శక్తులు

ఏకం కావాలి: రాజా

న్యూఢిల్లీ: వామపక్ష, ప్రగతిశీల, లౌకిక శక్తుల ఐక్యతకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పునరుద్ఘాటించారు. అనేక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నందున బీజేపీని గద్దె దించేందుకు ఏకం కావాలని వామపక్ష, ప్రగతిశీల, లౌకిక శక్తులకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో సోమవారం సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి గిరీశ్ చంద్ర శర్మతో లోకతాంత్రిక్ జనతా దళ్ (ఎల్‌జేడీ) జాతీయ అధ్యక్షుడు జావేద్ రజా నేతృత్వ బృందం భేటీ అయి తాజా రాజకీయ పరిణామాలపై సమాలోచనలు జరిపింది. ఎల్‌జేడీ ఉపాధ్యక్షులు జుబేర్ అహ్మద్ ఖురేషి, నదర్‌దౌడ, కార్యదర్శి సరితాతో పాటు వేర్వేరు రాష్ట్రాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం రాజాకు చిరు సత్కారం చేశారు.

ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా...

ప్రజాకాంక్షలు నెరవేరలేదు

ఆవిర్భావ దినోత్సవంలో నారాయణ

8 లో



4 వేలకు చేరువలో కోవిడ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కొవిడ్-19 వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఇప్పటికే రోగుల సంఖ్య నాలుగు వేలకు చేరువైంది. గత 24 గంటల్లో 203 కొత్త కేసులు నమోదయ్యాయి. నాలుగు మరణాలు సంభవించాయి. దేశ రాజధాని దిల్లీతో పాటు కేరళ, మహారాష్ట్ర, తమిళనాడులో ఒక్కొక్కరు చొప్పున కోవిడ్‌తో మరణించారు. కేసుల సంఖ్య 3,961కు పెరిగినట్లు ఆరోగ్య శాఖ సోమవారం నివేదించింది. కేరళలో 1,435 మంది, మహారాష్ట్రలో 506 మంది, దిల్లీలో 486 మంది, గుజరాత్‌లో 338 మంది, పశ్చిమ బెంగాల్‌లో 331 మంది చొప్పున కోవిడ్‌తో బాధపడుతున్నారు. జనవరి 1 నుంచి ఇప్పటివరకు 32 మంది వైరస్ కారణంగా చనిపోయినట్లు

- మిగతా 2 లో

రూ.6 వేల కోట్ల 2 వేల నోట్లు ప్రజల వద్దే: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ రూ.రెండు వేల నోట్లపై సోమవారం కీలక ప్రకటన చేసింది. వెనక్కి తీసుకున్న రూ.రెండువేల నోట్లు పూర్తిస్థాయిలో రిజర్వ్ బ్యాంక్‌కు చేరలేదని పేర్కొంది. ప్రస్తుతం రూ.6,181 కోట్ల విలువైన నోట్లు ఇంకా ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. నోట్ల రద్దు తర్వాత కరెన్సీని కొరతను అధిగమించేందుకు రిజర్వ్ బ్యాంక్ 2016 నవంబరు ఎనిమిదో తేదీన రూ.రెండువేల నోట్లను ప్రవేశ పెట్టింది. మహాత్మా గాంధీ సిరీస్ నోట్లలో భాగంగా అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో నోట్లను

- మిగతా 2 లో

కామాంధుడికి 30 ఏళ్ల జైలు

చెన్నై: గతేడాది అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దోషిగా తేలిన జ్ఞానశేఖరన్‌కు 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జస్టిస్ రాజలక్ష్మి తీర్పు చెప్పారు. శిక్షతోపాటు రూ.90 వేలు జరిమానా కూడా విధించారు. కాగా, గత వారం ఈ కేసును విచారించిన చెన్నై లోని మహిళా కోర్టు జ్ఞానశేఖరన్‌ను దోషిగా తేల్చింది. చార్జిషీట్‌లో పేర్కొన్న మొత్తం 11 అభియోగాల్లో అతడు దోషిగా తేలాడు. ఈ కేసు విచారణ సందర్భంగా మహిళా కోర్టు జడ్జి

- మిగతా 2 లో

మరో ముందడుగు

- ప్రజల వద్దకే రెవెన్యూ అధికారులు
- నేటి నుంచి 20 వరకు అన్ని మండలాల్లో సదస్సులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం తమ స్వార్థం కోసం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగం చేసిందని, జరిగిన తప్పులను సరిచేసి మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేసి భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకువెళుతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులపై సోమవారం మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరిన విధంగా రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చామన్నారు. మొదటి దశలో 17వ తేదీ నుంచి నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి రెవెన్యూ సదస్సులను నిర్వహించామని తెలిపారు. ఆ తర్వాత మే 5 నుంచి 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. తాజాగా జూన్ 3 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టంలో భాగంగా మిగిలిన అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మంత్రి వివరించారు. అన్ని రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్‌తో కూడిన బృందం వెళుతుందని, ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తుందని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు వారి ప్రమేయం లేకుండానే భూ సమస్యల్లో చిక్కుకున్నారని అన్నారు. మొదటగా నాలుగు పైలట్ మండలాల్లో 72 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన సదస్సుల్లో 13 వేలకు పైగా దరఖాస్తులు

- మిగతా 2 లో

అభివృద్ధిలో ఆదర్శ ప్రజాప్రభుత్వం

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, దేశానికే ఆదర్శంగా ఇందిరమ్మ ప్రభుత్వం అందరి సహకారంతో పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఖమ్మం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు అనేక మంది వీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, అమరవీరులందరికీ ఘనంగా నివాళులర్పిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నామని చెప్పారు. ప్రధానంగా రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పంట సాయం, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందజేయడంతో పాటు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్, రైతులకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. విద్యారంగంలో గొప్ప మార్పులు తెచ్చే దిశగా అన్ని కులాల వారు ఒకే దగ్గర కలిసిమెలిసి చదువుకునేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 20 ఎకరాల్లో అన్ని ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. పోడు భూములు కలిగి, దశాబ్దాలుగా విద్యుత్ సౌకర్యం లేని గిరిజనుల కోసం ఇందిరా సౌర గిరిజన వికాస పథకం కింద 42 వేల కుటుంబాలకు సౌర విద్యుత్‌కు అవసరమైన పరికరాలను అందించడంతో పాటు బోర్లు వేయించి... వాటికి డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలు కల్పించే కార్యక్రమం ప్రభుత్వం వేగంగా చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ విజన్ ప్రణాళికనే భగవద్గీతగా భావిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. విద్యుత్ వినియోగ డిమాండ్ 17,162 మెగావాట్లు కాగా, 2030 నాటికి గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 24,215 మెగావాట్లకు చేరుతుందన్న అంచనాతో పని చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీ ప్రకారం 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ సాధిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 1000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ పవర్ ప్లాంట్‌ను స్వయం సహాయక బృందాలచే ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. రూ.100 కోట్లతో వేసంగిలో పంటలు కాపాడటానికి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా నీరు అందించాం. పాలేరు లింక్ కెనాల్‌కు సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయని, మంచుకొండ ఎత్తిపోతల పథకం

- మిగతా 2 లో

తొలి తెలంగాణ ఉద్యమానికి

నాంది సీపీఐ

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వాలు పనిచేయాలి

ఆవిర్భావ దినోత్సవంలో కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు నీళ్లు, నిధులు, నియామకాల వివక్ష నేపథ్యంలో దీన్ని వ్యతిరేకిస్తూ 1969లో తొలి తెలంగాణ ఉద్యమానికి కొత్తగూడెం ప్రాంతం నాంది పలికిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గుర్తు చేశారు. దశబ్దాల తరబడి దోపిడీ, సమాంతర న్యాయం కోసం కొనసాగిన స్వరాష్ట్ర ఉద్యమంలో ఎందరో ప్రాణత్యాగాలు చేశారన్నారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు సక్రమంగా అమలైనప్పుడే ప్రజలు ఆకాంక్షించిన తెలంగాణ సాకారం అవుతుందని కూనంనేని స్పష్టం చేశారు. ఆ దిశగా పాలక ప్రభుత్వాలు తమ కార్యాచరణను అమలు చేయాలని కోరారు. 11వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తోపాటు బస్టాండు సెంటర్లోని అమరవీరుల స్థూపం వద్ద జాతీయ జెండా ఎగురవేసి, తెలంగాణ ఉద్యమ అమరులకు నివాళులర్పించారు. జిల్లా కార్యాలయం శేషగిరిభవన్లో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా జాతీయ జెండాను ఎగురవేశారు. కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికి, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి తొలి, మలి దశ ఉద్యమానికి కొత్తగూడెం ప్రాంతమే శ్రీకారం చుట్టిందని అన్నారు. ఇక్కడ ప్రారంభమైన ఉద్యమం తెలంగాణ ప్రజల్లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కిటాక్యూషు ప్రతినిధి బృందంతో రేవంత్ భేటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తాను జపాన్‌లో పర్యటించిన క్రమంలో కిటాక్యూషు నగరం ఎకో-టౌన్ మోడల్‌తో చాలా ప్రేరణ పొందానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ ప్రేరణతో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో అలాంటి నమూనాను అభివృద్ధి చేయడం కోసం అనేక జపనీస్ కంపెనీలతో అవగాహన ఒప్పందాలపై సంతకం చేసిందన్నారు. కిటాక్యూషు ప్రతినిధి బృందం సభ్యులతో సోమవారం సీఎం భేటీ అయ్యారు. తొలుత తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు హైదరాబాద్‌కు వచ్చిన ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. గత ఏప్రిల్‌లో తాను జపాన్ సందర్శించినప్పుడు అక్కడి అభివృద్ధిని, మీ పనితనాన్ని చూశానన్నారు. ముఖ్యంగా

- మిగతా 2 లో

సీమ కరువు నివారణకే...

- 'పోలవరం-బనకచర్ల'పై కేంద్రానికి వివరణ
- రాష్ట్ర ప్రతిపాదనలు తెలిపిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం ముందు తన ప్రతిపాదనలు ఉంచింది. సోమవారం న్యూదిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఏపీ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఆర్థిక శాఖ కార్యదర్శి పీయూశ్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ఈ ప్రాజెక్ట్‌పై కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు లేవనెత్తిన అనేక సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ప్రాజెక్టు సమగ్ర వివరాలను కేంద్ర ఆర్థిక శాఖకు అందించారు. ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలు, నీటి పంపిణీ విధానం, భూసేకరణ, ప్రజలకు వచ్చే లాభనష్టాలను వివరించారు. భవిష్యత్తులో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు స్వీయ ఆర్థిక ప్రాజెక్టుగా ఉంటుందని తెలిపారు. నీటి కరువుతో ఇబ్బందిపడుతున్న వెనుకబడిన రాయలసీమకు ఈ ప్రాజెక్టు శాశ్వత నీటి పరిష్కారాన్ని కల్గిస్తుందని వివరించారు. వీటితోపాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సైతం నీటి సమస్య తీరనుందని తెలిపారు. దాదాపు 80 లక్షల మంది ప్రజలకు ఈ ప్రాజెక్ట్ వల్ల ఉపయోగం కల్గుతుందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభ్యంతరాల గురించి కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు ఏపీ అధికారులు

- మిగతా 2 లో

అమెరికాపై భారత్ ప్రతీకార సుంకాలు

డబ్ల్యూటీఓ ద్వారా నోటీసులు: తిరస్కరించిన అగ్రరాజ్యం



న్యూఢిల్లీ/వాషింగ్టన్: అమెరికాకు చెందిన కొన్ని రకాల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించనున్నట్లు భారత్ వెల్లడించింది. ఈ మేరకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)కు సమాచారం ఇచ్చింది. భారత స్టీల్, అల్యూమినియంపై సుంకాలకు ప్రతికార సుంకాలు విధించాలని నిర్ణయించింది. ఇదే క్రమంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా అమెరికాకు నోటీసులు పంపింది. వాటిని అమెరికా తిరస్కరించింది. నోటీసులు బహుపాక్షిక వాణిజ్య నియమాలకు అనుగుణంగా లేవని పేర్కొంది. స్టీల్, అల్యూమినియంపై సుంకాలు భారత్ చెప్పినట్లు 'భద్రతా చర్యలు' కాదని, జాతీయ భద్రతా పరిగణనలపై ఆధారపడి ఉన్నాయని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై భారత్‌తో చర్చలు జరిపేది లేదని కూడా స్పష్టంచేసింది. ఈ పరిణామాల క్రమంలో అమెరికా దిగుమతులపై రాయితీల తొలగింపునకు భారత్ సిద్ధమైంది. అమెరికా నుంచి వచ్చే లోహాలపై అధిక సుంకాలు విధించాలని నిర్ణయించింది. భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్న స్టీల్, అల్యూమినియంలపై అమెరికా 25 శాతం సుంకాలు విధిస్తున్నది. అయితే ఈనెల 4వ తేదీ నుంచి వాటిని 50 శాతానికి పెంచబోతోంది. దీంతో 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం త్వరలోనే జరగబోతోందని చెబుతున్న క్రమంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది.

అమెరికా ఆరోపణలు నిరాధారం: చైనా

బీజింగ్: అమెరికాపై చైనా మండిపడింది. ఉద్దేశపూర్వకంగా తమపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. అమెరికా కావాలనే ద్వైపాక్షిక వాణిజ్యంలో ఆర్థిక, వాణిజ్య ఘర్షణల, అస్థిరత సృష్టిస్తోందని ని చైనా వాణిజ్య శాఖ ఆగ్రహం వ్యక్తంచేసింది. జెనీవా వేదికగా జరిగిన వాణిజ్య చర్చల్లో అవగాహనకు వచ్చినప్పటికీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే తమ దేశంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించింది. చైనా ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. జెనీవా ఒప్పందాన్ని అమలు చేసినట్లు చైనా విదేశాంగ శాఖ వెల్లడించింది. బీజింగ్‌పై వాషింగ్టన్ ఉద్దేశపూర్వకంగా వివక్షపూరిత చర్యలు తీసుకొన్నట్లు ఆరోపించింది. కృత్రిమ మేధకు సంబంధించిన చిప్స్‌పై నియంత్రణ, చిప్ డిజైన్ సాఫ్ట్‌వేర్ల విక్రయాలను అడ్డుకోవడం, తమ దేశ విద్యార్థుల వీసాల రద్దు వంటివి అమెరికా చేస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. మే మధ్య వారంలో బీజింగ్-వాషింగ్టన్ మధ్య జెనీవా వేదికగా ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 90 రోజుల పాటు మూడంకెల సుంకాల అమలును నిలిపివేయాలి. చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాలు, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్ పరిశ్రమకు ముడిసరకును నిరాటంకంగా సరఫరా చేయాలి. అయితే ద్వైపాక్షిక ఒప్పందాన్ని చైనా ఉల్లంఘించిందని ట్రంప్ ఆరోపించారు. స్టీల్, అల్యూమినియం దిగుమతిపై సుంకాలను రెట్టింపు అంటే 50శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు.

సూడాన్ ప్రభుత్వం రద్దు

బీరుట్: సూడాన్‌లో ప్రభుత్వం రద్దు అయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా కసరత్తుకు ముందుగా మంత్రివర్గాన్ని రద్దు చేస్తూ ప్రధాని కామిల్ ఇద్రీస్ ఆదేశాలిచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకు బాధ్యతలను ఆయా మంత్రిత్వశాఖల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు అప్పగించాలని ఇద్రీస్ నిర్ణయించారు. సూడన్ ప్రధానిగా ఇద్రీస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. 2021 నుంచి సైనిక తిరుగుబాటు క్రమంలో సూడాన్‌కు మొదటి ప్రధానిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రజలకు సందేశమిస్తూ రాజకీయ సుస్థిరతకు కృషి చేస్తానన్నారు. సుస్థిరతకు, భద్రతకు కట్టుబడతానని చెప్పారు. దేశ సమగ్ర పునరుద్ధరణకు తొలి ప్రాధాన్యత ఇస్తానని ఇద్రీస్ వెల్లడించారు.

రఫా దాడి హమాస్ పనే: ఐడీఎఫ్

టెల్అవీవ్: గాజాలో భూతల, వైమానిక దాడులతో విరుచుకుపడుతున్న ఇజ్రాయిల్ తాజాగా రఫాలోని మానవతా సంస్థకు చెందిన కేంద్రంపై కాల్పులను జరిపినది తాము కాదని ఓ ప్రకటన చేసింది. 'గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్' కేంద్రం వద్ద కాల్పుల ఘటనకు ఐడీఎఫ్‌కు సంబంధం లేదని పేర్కొంది. ఇది హమాస్ పని, మా దళాలు కాల్పులు జరుపలేదు అని ఒక ప్రకటన విడుదల చేసింది. తమ వాదనకు బలం చేకూర్చే విధంగా ఓ డ్రోన్ వీడియోనూ బహిర్గతం చేసింది. ఆహార కేంద్రం వద్దకు వెళుతున్న పలస్తీనియన్లపై కాల్పులు జరుపుతున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపించాయి. ప్రజలు ఆహారం తీసుకోకుండా హమాస్ అడ్డుకున్నట్లు ఎక్స్‌లో ఐడీఎఫ్ ఆరోపించింది. కాల్పుల్లో 31 మంది చనిపోయిన విషయం విదితమే. మృతులను తల, ఛాతిపై కాల్చి చంపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటన జరిగిన ప్రదేశం ఇజ్రాయిల్‌ల్ నియంత్రణలో ఉందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే హమాస్ వర్గీయులే ఈ కాల్పులకు తెగబడ్డారని, ఆ ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఐడీఎఫ్ చెప్పుకుంటోంది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటనలో 31 మంది చనిపోగా, 150 మందికి పైగా గాయపడ్డారు. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్ఎఫ్) కేంద్రం వద్ద ఈ దాడి జరిగిందని గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. వేల సంఖ్యలో వస్తున్న జనంపై కిలోమీటరు దూరం నుంచి కాల్పులు జరిపారని స్థానికులు వెల్లడించారు. అన్ని వైపుల నుంచి బుల్లెట్లు దూసుకొచ్చాయని వాపోయారు.

పోలాండ్ అధ్యక్షుడిగా కరోల్ నవ్‌రాకీ

వార్సా: పోలాండ్ అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి కరోల్ నవ్‌రాకీ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష లా అండ్ జస్టిస్ (పీఐఎస్) పార్టీ మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేసిన కరోల్ 50.8శాతం ఓట్లతో విజయం సాధించినట్లు పోలిష్ నేషనల్ ఎలక్టోరల్ కమిషన్ (పీకేడబ్ల్యూ) సోమవారం ప్రకటించింది. ప్రత్యర్థి, అధికార సివిక్ కోయిలేషన్ (కేఓ) అభ్యర్థి, వార్సా మేయర్ రఫల్ జాస్కోవిస్కీకి 49.11 శాతం ఓట్లు వచ్చినట్లు తెలిపింది. కరోల్ నవ్‌రాకీ మొదటిసారి అధ్యక్ష బరిలో నిలిచారు. ఆయన వృత్తిపరంగా చరిత్రకారులు. పోలాండ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ రిమెంబరెన్స్ అధిపతి. కాగా, ప్రస్తుత అధ్యక్షుడు ఆంద్రెజ్ దుడా చివరి పదవీ కాలం ఆగస్టు 6వ తేదీతో ముగియనుంది. అనంతరం కరోల్ ఆ పదవీ బాధ్యతలు చేపడతారు.

కామాంధుడికి 30 ఏళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

రాజలక్ష్మి మాట్లాడుతూ... అన్ని అభియోగాల్లో దోషిగా తేలినందున జ్ఞానశేఖరన్‌కు కచ్చితంగా తీవ్రమైన శిక్షపడాలని అన్నారు. అయితే జ్ఞానశేఖరన్ మాత్రం తనకు తక్కువ శిక్ష విధించాలని కోర్టును కోరాడు. తాను వృద్ధురాలైన తన తల్లితోపాటు, ఎనిమిదేళ్ల కుమార్తె బాగోగులు చూసుకోవాల్సి ఉందని, కాబట్టి తనకు తక్కువ శిక్ష విధించాలని అభ్యర్థించాడు. అన్నా యూనివర్సిటీ పరిసరాల్లో బిర్యానీ పాయింట్ నడుపుతున్న జ్ఞానశేఖరన్ గత ఏడాది డిసెంబరులో 19 ఏళ్ల విద్యార్థినిపై క్యాంపస్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి క్యాంపస్ వెనుకవైపు ఏకాంతంగా ఉన్న సమయంలో నిందితుడు అక్కడికి వెళ్లి వారిని వీడియో తీశాడు. బాధితురాలి స్నేహితుడిని బెదిరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ఆ ఘటనను తన మొబైల్‌లో రికార్డు చేశాడు. విషయం బయటకుచెబితే వీడియో బయట పెడుతానని బ్లాక్‌మెయిల్ చేశాడు. అయినా బాధితురాలు భయపడకుండా తన స్నేహితుడితో కలిసి ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఘటనపై విచారణ జరిపి చార్జిషీట్ దాఖలు చేశారు. జ్ఞానశేఖరన్‌పై మొత్తం 11 అభియోగాలు మోపారు. అన్ని అభియోగాల్లోనూ అతడిని దోషిగా తేల్చిన మహిళా కోర్టు... సోమవారం శిక్ష ఖరారు చేసింది.

సీమ కరువు నివారణకే...

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం చంద్రబాబు తన దిల్లీ పర్యటనలో భాగంగా వివరించారు. అలాగే ఈ ప్రాజెక్ట్‌పై జలవనరుల శాఖ మంత్రికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. నదుల అనుసంధానంతోపాటు దేశంలో అనేక ప్రాజెక్టులు చేపడుతున్న వేళ.. రాయలసీమలోని జిల్లాలకు బనకచర్ల ద్వారా నీరు అందాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ఆ లేఖలో స్పష్టం చేశారు. గోదావరి వరదనీటిని సముద్రంలోకి వృథాగా పంపే కంటే.. బనకచర్ల ద్వారా రాయలసీమతోపాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు పంపడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.81 వేల కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సీఎం కోరారు. ఈ అంశాలన్నింటినీ అధికారులు కేంద్రానికి సమగ్రంగా వివరించారు.

రూ.6 వేల కోట్ల 2 వేల నోట్లు ప్రజల వద్దే

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేసింది. దేశ అవసరాలకు సరిపడా ఇతర డినామినేషన్‌ల కరెన్సీ నోట్లు అందుబాటులో ఉండటంతో రూ.రెండువేల నోట్లను 19 మే , 2023న రూ.రెండువేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. వెనక్కి తీసుకున్న సమయంలో చెలామణిలో రూ.3.56 లక్షల విలువ రూ.రెండువేల నోట్లు ఉన్నాయి. ఆ తర్వాత వాటిని మార్చుకునేందుకు 2023, అక్టోబరు ఏడో తేదీ వరకు ఆర్‌బీఐ అవకాశం ఇచ్చింది. అయితే, ఆర్‌బీఐ ఆఫీసుల్లో ఈ నోట్లను మార్చుకుని తమ అకౌంట్లల్లో డిపాజిట్ చేసుకునే అవకాశం ఇప్పటికీ ఉందని.. దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బీఐ కేంద్ర కార్యాలయాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉందని చెప్పింది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను రూ.రెండువేల నోట్లను పోస్టాఫీసుల్లోనూ మార్చుకోవచ్చని చెప్పింది.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా

జగన్‌కు లోకేశ్ సవాల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ సోమవారం బహిరంగ సవాల్ విసిరారు. మీరు చేసిన ఆరోపణలు నిరూపిస్తే నేను నా మంత్రి పదవికి రాజీనామా చేస్తాను. మీరు చేసిన ఆరోపణలు తప్పని తేలితే రాష్ట్ర యువతకు క్షమాపణ చెప్పండి చాలు అన్నారు. ఆరోపణలు చేయడం, పారిపోవడం జగన్‌కు కొత్తేమీ కాదు. ఉర్సా కంపెనీకి విశాఖపట్నంలో ఎకరం రూపాయి చొప్పున భూములు కట్టబెట్టారంటూ మీరు తీవ్ర ఆరోపణ చేశారు. నేను స్పష్టంగా మరోసారి చెబుతున్నా... ఉర్సా కంపెనీకి విశాఖలోని ఐటీపార్క్ హిల్-3 లో ఎకరం కోటి రూపాయలు చొప్పున మూడున్నర ఎకరాలు కేటాయించాం. కాపులుప్పాడలో ఎకరం రూ.యాభై లక్షల చొప్పున 56.36 ఎకరాలు కేటాయించాం. బురదజల్లి ప్యాలెస్ లో దాక్కోవడం కాదు... చేసిన ఆరోపణలు నిరూపించండి. చాలెంజ్ కు సిద్ధమా జగన్ రెడ్డి గారు? అంటూ లోకేశ్ ప్రశ్నించారు. 'మీ ఐదేళ్ల విధ్వంస పాలనలో ఒక్క కంపెనీ తీసుకురాకపోగా ఉన్న కంపెనీలను ఇతర రాష్ట్రాలకు తరిమేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నాం. పెద్ద ఎత్తున పెట్టుబడులు రాబడుతున్నాం. కంపెనీలు రావడం, యువతకు ఉద్యోగ అవకాశాలు రావడం చూసి మీరు తట్టుకోలేక పోతున్నారు. ఈనో వాడండి కాస్త రిలీఫ్ వస్తుంది ' అంటూ లోకేశ్ ఎద్దేవా చేశారు.

ఇండిగో విమానానికి తప్పిన ముప్పు

రాంచీ: ఓ పక్షి ఆకాశంలో అల్లకల్లోలం సృష్టించింది. 170 మంది ప్రయాణికులతో వెళుతున్న విమానాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనతో విమానాన్ని,అందులోని ప్యాసింజర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. అయితే, పైలట్ అప్రమత్తం కావడంతో ప్రయాణికులు సురక్షితంగా భయపడ్డారు. వారిలో కొందరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం 1.14 గంటల సమయంలో ఇండిగో ఎయిర్‌బస్ 320 విమానం పాట్నా నుండి రాంచీకి రావాల్సి ఉంది. ఆ సమయంలో ఎయిర్‌బస్ 320ని ఓ పక్షి ఢీకొట్టింది. ఈ ఘటనలో విమానానికి పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రమాదంతో అప్రమత్తమైన పైలట్ చాకచక్యంగా ల్యాండింగ్ చేయాల్సిన ఎయిర్ పోర్టుకు కాకుండా సమీపంలో ఉన్న రాంచీ బిర్సా ముండా విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా దించారు. ఈ ఘటనలో 175 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. 'ఈ సంఘటన జరిగినప్పుడు విమానం 3,000 నుండి 4,000 అడుగుల ఎత్తులో ఉంది. ఇండిగో విమానం పాట్నా నుండి రాంచీకి వస్తుండగా, పైలట్ ఇక్కడ అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది' అని రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయ డైరెక్టర్ ఆర్ ఆర్ మౌర్య తెలిపారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని, పక్షి ఢీకొట్టడం వల్ల విమానానికి పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. ఇంజనీర్లు నష్టాన్ని అంచనా వేస్తున్నారని తెలిపారు.

కొల్లేరు సమస్యకు చెక్

పర్యావరణం కాపాడుతూ మానవీయ కోణంలో పరిష్కరిద్దాం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పర్యావరణపరంగా కీలకమైన కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవడంతోపాటు, ఆ ప్రాంతంలో ఉన్న ప్రజల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొల్లేరుపై కోర్టు తీర్పులు, నిబంధనలు, కేంద్ర సంస్థల ఆదేశాలు, స్థానిక పరిస్థితులు, పర్యావరణం, కాంటూరు అంశాలపై సచివాలయంలో సోమవారం సీఎం సమీక్షించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... కొల్లేరు పరిధిలో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారని... కొల్లేరు కాంటూరు పరిధి అంశంలో చాలా కాలంగా వీరు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దీని పరిష్కారం కోసం 2014 నుంచి 2019 మధ్య నాటి తెలుగుదేశం ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసిందని... ఇందులో భాగంగా 2018లో నేషనల్ వైల్డ్ లైఫ్ బోర్డు 20 వేల ఎకరాల జరాయితీ, డీ పట్టా భూములను కొల్లేరు పరిధి నుంచి మినహాయించి కొత్త సరిహద్దులను నిర్ధారించేందుకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి సిఫారసు కూడా చేయగా... దీనిపై కొందరు అభ్యంతరాలు చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరిందన్నారు. కాగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. కొల్లేరు కాలుష్య కాసారం కాకుండా చూడాలని, కొల్లేరులోకి వెళ్తున్న డ్రెన్ వాటర్‌కు పరిష్కారం జరగాలని, విచ్చల విడిగా డ్రెయిన్లు వదిలేసి కొల్లేరును కాలుష్యమయం చేసే ప్రక్రియకు బ్రేక్ పడాల్సి ఉందన్నారు. ముఖ్యంగా కొల్లేరు నుంచి నీటిని సముద్రంలోకి తీసుకువెళ్లే ఉప్పుటేరు అక్రమణలను తొలగించాలి. అవుట్ లెట్లు పూర్తిగా క్లియర్ చేయాలి. ఈ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. కొల్లేరు రైతుల సమస్యలపై మాట్లాడుతూ...కొల్లేరు పరిధిలో 20 వేల ఎకరాల జిరాయితీ, డీ పట్టా భూములు ఉన్నాయి. కాంటూరు సమస్య నేపథ్యంలో ముందుగా వీరికి న్యాయం జరిగేలా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సీఈసీని, సుప్రీంకోర్టు ముందు ఉంచి వారిని ఒప్పించాలి. పక్షులు, పర్యావరణంతో పాటు ప్రజలకు కూడా న్యాయం జరిగేలా కార్యాచరణ ప్రారంభించాలని చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షకు చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో పాటు అధికారులు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు.

5న కోటి మొక్కల ప్లాంటేషన్

రాష్ట్రంలో పచ్చదనాన్ని మరింత పెంచే కార్యక్రమంలో భాగంగా నెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో కలెక్టర్లు, మంత్రులు, ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములవ్వాలని కావాలని కోరారు. విద్యాసంస్థలు, వైద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్ స్టేషన్లు, రహదారులకు ఇరువైపులా ట్రీ గార్డులతో ప్లాంటేషన్ చేయాలని సూచించారు.

కిటాక్యూషు ప్రతినిధి బృందంతో రేవంత్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

కిటాక్యూషు నగరం ఎకో-టౌన్ మోడల్‌తో చాలా ప్రేరణ పొందినట్లు వెల్లడించారు. తెలంగాణ, కిటాక్యూషు మధ్య సహకార ఒప్పందం పై సంతకం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఒప్పందం సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, సున్నా ఉద్గారాలు, పట్టణ ఆవిష్కరణలలో సహకారానికి పునాది కానుందని చెప్పారు. మూసీనది అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్ట్ పైన తమ దృష్టి ఉందని తెలిపారు. తెలంగాణ యువతకు నైపుణ్యం కల్పించడం ప్రధాన ప్రాధాన్యతగా పెట్టుకున్నామన్నారు. మా విద్యార్థులకు మీ సహాయంతో జపనీస్ నేర్పించాలని అనుకుంటున్నట్లు వివరించారు. హైదరాబాద్, కిటాక్యూషు మధ్య విమాన కనెక్టివిటీ కోసం ప్రయత్నం చేస్తున్నామన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలు కల్పించడంతో పాటు వైద్యరంగంలో, పోలీస్, నీటిపారుదల, సింగరేణి కాలరీస్, ఇలా వివిధ రంగాలలో ఖాళీలను భర్తీ చేస్తూ నిరుద్యోగులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రక్షాళనకు విప్లవాత్మక చర్యలు తీసుకున్నామన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని విశ్వసించి ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాలు పెంచేందుకు విద్యా కమిషన్ ను నియమించినట్లు పేర్కొన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నామని, ఇందుకోసం 30 ఎకరాల్లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలను నిర్మించడంతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాలలో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, కులగణన ద్వారా దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపి, శాస్త్రీయంగా కులగణన నిర్వహించిందని, బీసీల లెక్క 50.36 శాతంగా తేల్చామన్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై తమ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, మూడు గ్రూపులుగా విభజించి చట్టబద్ధత కల్పించామన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నాల్గోతేదీని తెలంగాణ సోషల్ జస్టిస్ డే గా జరపాలని నిర్ణయించామని వివరించారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, నిజమైన లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. మే 20 నాటికి 5,364 ఇందిరమ్మ లబ్దిదారులకు రూ.53 కోట్ల 64లక్షలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. పేదల కోసం సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించి విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టామన్నారు. దావోస్, సింగపూర్, జపాన్ వంటి దేశాల్లో పర్యటించి రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఐటీ దిగ్గజాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, హెచ్.సీ.ఎల్, కాగ్నిజెంట్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్ లో తమ సంస్థలను విస్తరిస్తున్నాయని, తెలంగాణ రైజింగ్ లో ఇదొక తొలి మెట్టుగా అభివర్ణించారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ ఎకానమీ తీర్చిదిద్దడంలో తెలంగాణను అగ్రభాగాన నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను ఒక ట్రిలియన్ ఎకానమీగా తీర్చిద్దాలని నిర్ణయించామన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని, ప్రపంచంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోందన్నారు.

మరో ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాయని తెలిపారు. రెండో విడతలో 28 మండలలో 421 రెవెన్యూ గ్రామాలల్లో నిర్వహించిన సదస్సుల్లో 42 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు చేసి ఇప్పటి వరకు 60 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించామన్నారు. అధికంగా సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని, దీనికి త్వరలో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలు గ్రామ స్థాయిలో అందించడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ముందుకు వెళుతుందని పొంగులేటి తెలిపారు.

మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలి

ముఖ్యంగా కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అన్నారు. భూభారతి చట్టంలో భాగంగా గ్రామ పరిపాలన అధికారులు (జీపీవో) కు అతి త్వరలో నియామక పత్రాలను అందజేసి మండలాల్లో నియమించబోతున్నామని ప్రకటించారు. గ్రామ పాలన అధికారుల 10,954 పోస్టుల భర్తీకి జీవో విడుదల చేయగా 5 వేలకు పైగా దరఖాస్తులు అందాయని, ఇందులో మే 25న నిర్వహించిన పరీక్షకు 4,588 మంది అభ్యర్థులు హాజరు కాగా తుది మెరిట్ జాబితాలో 3,550 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో భూముల రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లతో పాటు సర్వే మ్యాప్ జతపరచాలని భూభారతి చట్టంలో పేర్కొనడం జరిగిందని, అందుకు అనుగుణంగా సర్వే సెటిల్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. మొదటి దశలో ఆరు వేల మంది సర్వేయర్లను రెండు నెలల్లో నియమించబోతున్నట్లు వెల్లడించారు. 413 గ్రామాలలో పునః సర్వే నిర్వహించబోతున్నామని, ఇప్పటికే 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. టీజీఆర్‌ఏసీ (తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్) ద్వారా సర్వే రికార్డులను (మ్యాప్‌లు) డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టామని, ఇందుకోసం 3 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు.

4 వేలకు చేరువలో కోవిడ్ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

నివేదిక పేర్కొంది. కేరళ, మహారాష్ట్ర, దిల్లీలో వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులైన దిల్లీలో 22 ఏళ్ల యువతి, మహారాష్ట్రలో 44 ఏళ్ల వ్యక్తి శ్వాస సంబంధిత సమస్యలతో మరణించినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం దేశంలో ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్ల వేవ్ సాగుతోంది. ఇవి ఓమిక్రాన్ జేఎన్.1 వేరియంట్ నుంచి పుట్టిన వైరస్‌లు. ఈ రెండు భారత్‌లో విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం పాజిటివిటీ రేటు 64.08 శాతంగా ఉంది. తాజా పరిస్థితిలో ప్రతి ఇద్దరిలో ఒకరికి జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి వంటివి ఉంటున్నాయని, ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధిని నిరోధించేందుకు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, ఏకాంత వాసంలో ఉండాలని చెబుతున్నారు.

అభివృద్ధిలో ఆదర్శ ప్రజాప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా అనతి కాలంలో నీరు అందించి రికార్డు స్థాయిలో రైతులకు మేలు జరిగేలా పని చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. మున్నేరుకు రెండు వైపులా ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి రూ.525.36 కోట్లతో వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. మధిర నియోజకవర్గంలో ఇందిరా మహిళ డెయిరీ ప్రాజెక్టు కింద 21 వేల మంది మహిళలకు రెండు పాడి గేదెలు ఇచ్చామన్నారు. ఖమ్మం చుట్టూ జాతీయ రహదారులు రావడం నగర అభివృద్ధికి జిల్లా అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అటవీ పార్కు కాటేజీ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. పాలేరు లేక్‌లో బోటింగ్, క్యాంటీన్, పిక్నిక్ స్పాట్, పిల్లలకు ప్లే ఏరియా, బర్డ్ వాచింగ్‌కు చర్యలు తీసుకున్నామన్నారు. ఖమ్మం ఖిల్లా రూప్ వే కోసం రూ.29 కోట్లు, నేలకొండపల్లి బౌద్ధ స్థూపాల అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా అనేక మంది తెలంగాణ సమరయోధులను సన్మానించి స్వయంగా కలిసి అందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, శాసన మండలి మాజీ సభ్యులు పి.నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, నగర మేయర్ పి.నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాడ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు మొహమ్మద్ జావేద్, నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలంగాణ ఉద్యమానికి నాంది సీపీఐ

(మొదటిపేజీ తరువాయి)

స్ఫూర్తిని, చైతన్యాన్ని నింపి రాష్ట్ర సాధనకు బాటలు వేసిందన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి స్వరాష్ట్రం కోసం జరిగిన పోరులో అగ్రభాగాన సీపీఐ నిలిచిందన్నారు. ఉద్యమాన్ని తారాస్థాయికి చేర్చి కేంద్రం ప్రభుత్వంలో కదలిక తెచ్చిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో స్వేచ్ఛలేని నిర్బంధాల నుంచి విముక్తి లభించినప్పటికి ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉద్యమ ఫలాలు ప్రజల దరిచేరాల్సిన క్రియాశీల బాధ్యత ఉందన్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగా కొత్తగూడెం నియోజకవర్గాన్ని బహుముఖంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, ధనలక్ష్మి, ఎస్ కె ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పేదలను విస్మరించిన ప్రభుత్వం

విశాలాంధ్ర - కారేపల్లి : మండల పరిధిలోని పేరుపల్లి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కమిటీలతో ఎక్కువగా భూములు ఉన్నవారికి, పక్కా ఇల్లు కలిగిన వారికి పూరిండ్లు ఉన్న వారిని వదిలిపెట్టి కొంతమంది వారి స్వార్థం కొరకు పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేసినారని స్థానిక బాధితులు సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరుపల్లి పంచాయతీ వ్యాప్తంగా అధికార పార్టీకి అనుకూలంగా సంపన్న కుటుంబాలకు ఇండ్లను కేటాయిస్తున్నారని ఎంపిక చేసిన లిస్టును రహస్యంగా ఉంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ పథకాలు పేద ప్రజలకు కాకుండా భూస్వాములకు సంపన్నులకు కట్టబెడుతున్నారని మండలంలో ఇందిరమ్మ కమిటీలకు అనుకూలంగా కుటుంబాలకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కమిటీ సభ్యులు ప్రవర్తించటం ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా మండల అభివృద్ధి అధికారి ఇందిరమ్మ ఇళ్లలో జరుగుతున్న పొరపాట్లను వివిధ గ్రామాలలో ఎంపికైన లిస్టును ప్రతి గ్రామములో ఎంక్వైరీ చేసి భూములున్న పక్కా భవనములు కలిగిన, ఎకరాల కొద్ది భూములు ఉన్న వారిని, లిస్టుల నుండి తొలగించి నిరుపేదలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఇందిరమ్మ ఇంట్లో కమిటీ సభ్యుడు పప్పుల వెంకటేశ్వర్లు, అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పప్పుల నిర్మల, బాధితులు అజ్మీర సరిత, శంకర్, ధార బక్కయ్య అజ్మీర నగేష్, ధారా రాంబాబు, పాయం బిక్షపతి, రవి, గుగులోత్ సుభద్ర, కోటం నాగమణి, అజ్మీర లక్ష్మి, విక్రమ్, గడ్డి రేణుక తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్స్ అర్హులైన పేదలకు ఇవ్వాలి

విశాలాంధ్ర - తొర్రూర్: గత ప్రభుత్వం 280 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిచేసిన వదిలేశారని, వాటిని అర్హులైన పేదలకు డబల్ బెడ్ రూమ్ కేటాయించాలని సోమవారం స్థానిక ఎమ్మెల్యే యశశ్వినిరెడ్డికి వినతిపత్రం ఇచ్చినట్లు సిపిఎం మండల కార్యదర్శి ఎండి యాకూబ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అర్హులైన నిరుపేదల కోసం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక దుబ్బ తండా సమీపాన 280 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి పేదలకు ఇవ్వకుండా విస్మరించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా నిరుపేదలను గుర్తించి అట్టి 280 ఇండ్లను నిరుపేదలకు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని వివరించినట్లు ఆయన తెలిపారు. వినతిపత్రంపై స్థానిక ఎమ్మెల్యే స్పందిస్తూ అర్హులైన నిరుపేదలకు గుర్తించి డబుల్ రూములు ఇస్తానని హామీ ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, అర్హులైన నిరుపేదలు పాల్గొన్నారు.

బహుముఖ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : తెలంగాణ ప్రాంతంలో వివక్షకు వ్యతిరేకంగా ఎన్నో ప్రాణ త్యాగాలు, సబండ వర్గాల పోరాటాలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ ఫలాలు అందిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం జూన్ 2న 11వ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఉదయం ఐ డి ఓ సి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రగతి మైదానంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముందుగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. రవాణా శాఖ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, పశుసంవర్ధక శాఖ, అగ్నిమాపక శాఖ వైద్యశాఖలు చేపడుతున్న పలు కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన శకటాలు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమరయోధులను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ముందుగా జిల్లా ప్రజలకు శుభాభినందనాలు తెలిపారు. ఎందరెందరో అమర వీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి విషయంలో దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. తెలంగాణ రైజింగ్ - 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచస్థాయి ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీపాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే వంటగ్యాస్ సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్ళు వంటి పథకాలతో పాటు, సంపన్నులతో సమానంగా తెలంగాణ మహిళలతో విద్యుత్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మహిళలు పెట్రోలు బంకులు, శిల్పారామంలో 100 ఇందిరా మహిళా శక్తి స్టాళ్ళను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేయించి, ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో 150 బస్సులు ఇప్పటికే అందజేయటం జరిగిందన్నారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యా చందన, ఆర్డీవో మధు, తాసిల్దార్ పుల్లయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లా సర్వోతో ముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పని చేద్దామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన ఆరుగురికి జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు. అభివృద్ధిని తెలిపే విధంగా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ముందు మంత్రి క్లాక్ టవర్ సెంటర్లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాల నుంచి అమరులకు నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో భాగంగా సోమవారం ఆయన నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలకిచ్చిన సందేశంలో తెలంగాణ రాష్ట్రం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతో మంది పోరాటాల వల్ల తెలంగాణ సాధించుకోగలిగామని, తాను సైతం తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేయడం జరిగిందని, నల్గొండ అంటే నమ్మకానికి ప్రతిరూపమని, పోరాటాల పొద్దుపొడుపు అని, అలాంటి నల్గొండలో పుట్టడం సంతోషమని అన్నారు. ప్రజల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఇందులో భాగంగానే తెలంగాణ రైజింగ్- 2047 పేరున పేదల సంక్షేమం కోసం సమగ్ర పాలసీలను రూపొందించిందని ప్రపంచ స్థాయిలో తెలంగాణను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నదని తెలిపారు. జిల్లాలో నాలుగు లక్షల 84210 మంది కుటుంబాలకు 997 చౌక ధర దుకాణాల ద్వారా ప్రతి ఒక్కరికి ఆరు జిల్లాలో చొప్పున 8 వేల 868 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం చేసామని, పారదర్శకంగా కుల గణన నిర్వహించి 42% రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్, నెల్లికంట సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ హాజరయ్యారు.

విలువలు గల నేత పోటు ప్రసాద్

పోటు స్మారక స్థూపాన్ని ఆవిష్కరించిన పువ్వాడ

విశాలాంధ్ర - ఖమ్మం : సమకాలిన రాజకీయాల్లో విలువలు కలిగిన నేతగా పోటు ప్రసాద్ పేరొందారని సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమాలలో పని చేసిన ఆయన చిరు విమర్శకు కూడా తావివ్వలేదని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఒక త్యాగాల కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ పోరాట వారసత్వాన్ని కొనసాగించారని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని పర్ణశాల సమీపంలో సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ ఏర్పాటు చేసిన పోటు ప్రసాద్ స్మారక స్తూపాన్ని -సోమవారం పువ్వాడ ఆవిష్కరించారు. స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా రంగాపురంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుల కుటుంబంలో జన్మించిన ప్రసాద్ విద్యార్థిగా ఖమ్మం వచ్చారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా రాష్ట్ర, జాతీయ నాయకునిగా పనిచేశారని ఆయన తెలిపారు. ఏఐటియుసి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘ కాలం సేవలు అందించిన పోటు ప్రసాద్ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. పోటు ప్రసాద్ విద్యాభిలాషి అని విద్యా సంస్థల ఏర్పాటులో సైతం కీలక భూమిక పోషించారని పువ్వాడ తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా పోటు ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ప్రజా ఉద్యమ నిర్మాణమే ప్రసాద్కు మనమిచ్చే ఘనమైన నివాళి అని పువ్వాడ తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వరదా నర్సింహారావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, పోటు ప్రసాద్ సతీమణి నిర్మల, తనయుడు రాజా సాత్విక్, పోటు ప్రసాద్ మాతృమూర్తి పోటు సక్కుబాయి, హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సిపిఐ నాయకులు యానాలి సాంబశివరెడ్డి, పోటుప్రసాద్ స్నేహితులు, ఐఎంఏ పూర్వ అధ్యక్షులు డాక్టర్ బాగం కిషన్రావు, బిఆర్ఎస్ నాయకులు వల్లభనేని రామారావు, -సత్యనారాయణరెడ్డి, వెంకన్న, జాకీర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పినపాక : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతాయని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మణుగూరు కిన్నెర కళ్యాణ్ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పినపాక మండలంలో అమరారం గ్రామానికి చెందిన శీలం జ్యోతి, పోలబోయిన రమణ, కొట్టెం రజిత అనే మహిళలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, పినపాక మండలంలో గ్రామపంచాయతీ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్పిఓ సుధీర్ కుమార్, పినపాక ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీవీ చౌదరి ధన్యజీవి

విశాలాంధ్ర - ఖమ్మం : తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు ఉద్యమ విస్తృతి కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన టివి చౌదరి ధన్యజీవి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. టివి చౌదరి ఐదవ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు -వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న టివి చౌదరి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం కృషి చేశారన్నారు. సుదీర్ఘ కాలం పాటు జిల్లా కార్యదర్శిగా సేవలు అందించిన ఆయన కమ్యూనిస్టు పార్టీ స్వర్ణయుగంలో పని చేశారన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ జాతీయ పతాకాన్ని -ఆవిష్కరించారు.

అమరులకు నివాళి : సిపిఐ ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించారు. ఖమ్మం పెవిలియన్ మైదానంలోని అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరుల త్యాగ ఫలితమే నేటి తెలంగాణ అని ఈ సందర్భంగా హేమంతరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు సాంబశివరెడ్డి, తాటి నిర్మల, వీరన్న, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆరు జిల్లాల్లో విస్తరించిన సింగరేణి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : తెలంగాణలోని ఆరు జిల్లాల్లో సింగరేణి విస్తరించగా 12 ఏరియాలలో 39 బొగ్గు గనుల ద్వారా ఉత్పత్తి సాధిస్తున్నట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్ వెల్లడించారు. ఈ బొగ్గు గనుల్లో 41వేల మంది కార్మికులతో ఏడాదికి 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తమ సంస్థ అందిస్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం నందు సింగరేణి ఆధ్వర్యం లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బలరామ్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని, తెలంగాణా గీతాన్ని ఆలపించారు. అంతకు ముందు సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్య నారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రకాశం స్టేడియం నుండి కొత్తగూడెం బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు తెలంగాణ రన్ నిర్వహించారు. ఉద్యమంలో అమరులైన తెలంగాణ వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కొంగు బంగారమైన మన సింగరేణిని కూడా జాతీయస్థాయిలోనే కాక అంతర్జాతీయ స్థాయి కంపెనీగా నిలపడం కోసం రాష్ట్ర ప్రభుత్వ దిశానిర్దేశంలో అనేక కొత్త ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. జీఎం పర్సనల్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో ముఖ్య అతిధులుగా బలరామ్ తోపాటు విశిష్ఠ అతిధులుగా డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం ఏఐటియూసి జనరల్ సెక్రటరీ కే.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ పి.రాజీవ్ కుమార్, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, యూనియన్ నాయకులు, ఉత్తమ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండాను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆవిష్కరించారు. అనంతరం ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు,పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కోసం,రాష్ట్ర సాధన కోసం జీవితాల్ని త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు.ప్రశాంత వాతావరణం, శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే, సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో పోలీస్ లపాత్ర కీలకమని, దానికనుగుణంగా అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో మరింత బాధ్యతగా పనిచేసి రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో జిల్లాకు మంచి పేరు, కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. అన్ని రంగాల్లోనూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచే విధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ చేతుల మీదుగా పోలీసు అధికారులకు, పోలీస్ సిబ్బందికి పోలీస్ పతకాలు అందచేశారు.

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్ కమిషన్ ఛైర్మెన్ సిరిసిల్ల రాజయ్య పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల పూలమొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా చెర్మన్ పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫైనాన్ కమిషన్ ఛైర్మెన్ మాట్లాడుతూ, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్మల్ జిల్లా ముందంజలో పయనిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలను ప్రదర్శించి అలరించారు. ఆతర్వాత విద్యారులకు బహుమతులను అందజేశారు. అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ సహకరంతో రైతులకు విత్తన ఉత్పత్తి కొరకు నాణ్యమైన ఫౌండేషన్ విత్తనాలను ఉచితంగా అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన చర్యలుచేపడుతున్నామని తెలిపారు. జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కళాజాత ప్రదర్శనల ద్వారా మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు, ఎస్సి, ఎస్టి అట్రాసిటీ, బాలల చట్టాలపై విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు

విశాలాంధ్ర - వనపర్తి : నీళ్లు, నిధులు, నియామకాలు, విభజన హామీల సాధనకు మళ్ళీ పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయరాములు పిలుపునిచ్చారు.సోమవారం వనపర్తి సిపిఐ జిల్లా ఆఫీసులో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కార్యదర్శి విజయరాములు జాతీయ పతాకాన్ని ఎగరవేసి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు నీళ్లు నిధులు నియామకాల్లో అన్యాయం జరుగుతోందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తొలి విడతలో 369 మంది, మలి విడతలో 1200 మంది ఆత్మ బలిదానం చేశారన్నారు. తెలంగాణ ప్రజల నీళ్లు, నిధులు, నియామకాలను నెరవేరుస్తామని అధికారంలోకి వచ్చి పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ వాటిని నెరవేర్చక పోగా మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. బీఆర్ఎస్ పాలకులు తెలంగాణను దోపిడీ చేశారన్నారు. టిఆర్ఎస్ను గద్దించి ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా నీళ్లు నిధులు నియామకాలు విభజన హామీలను సాధించే దిశగా పాలన సాగటం లేదన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే మార్గమని జాతీయస్థాయిలోను ఉమ్మడి రాష్ట్రంలోనూ ఒకే మాటపై నిలబడి పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. ప్రజల ఆకాంక్ష కోసం పోరాడి చరిత్రలో నిలిచిందన్నారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు కావస్తున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం భజన హామీలను నెరవేర్చటంలో ఫలమైందన్నారు. నీళ్ల నిధులు నియామకాల కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన సిపిఐ ఇప్పుడు మళ్ళీ వాటిన సాధించేందుకు మరోసారి పోరాల్సిన అవసరం ఉందని కార్యకర్తల సిద్ధం కావాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రకుర్మయ్య, భారతీయ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షులు జయమ్మ, నేతలుశిరీష, జ్యోతి, సాద్విని తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తమ ప్రభుత్వం ప్రజలకు అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.అనంతరం ర్యాలీగా వెళ్లి అమరవీరుల స్థాపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమీషనర్ అంబర్ కిశోర్ ఝా జాతీయ జెండానెగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. సింగరేణి ఆర్జీ వన్ కార్యాలయ ఆవరణలో జీఎం లలిత్ కుమార్ జాతీయ జెండానెగుర వేశారు.తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దఎత్తున తెలంగాణ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సేవా అధ్యక్షురాలు అనిత, ఏఐటీయుసి నాయకులు మడ్డి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. సిపిఐ, ఏఐటీయూసి కార్యాలయంలో నాయకులు గోసిక మోహన్, మడ్డిఎల్లయ్యలు జాతీయ జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నేరేడుచర్ల : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నేరేడుచర్ల పట్టణ, మండల పరిధిలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయంలో మున్సిపల్ కార్యాలయాల్లో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో సురిగి సైదులు, ఎంపిడిఓ కార్యాలయంలో ఇంచార్జీ అధికారి, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రవీందర్, వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ విజయలక్ష్మి, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ జావేద్, పలు పార్టీ కార్యాలయాల్లో ఆ పార్టీ అధ్యక్షులు, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆయ పార్టీల నాయకులు నూకల సందీప్ రెడ్డి, బచ్చలకూరి ప్రకాష్, తాళ్ళ సురేష్ రెడ్డి, సరికొప్పుల నాగేశ్వరరావు, ధనుంజయ నాయుడు, ఆకారపు వెంకటేశ్వర్లు, బల వెంకటేశ్వర్లు, కొదమగుండ్ల నాగేష్, కోణతం నాగిరెడ్డి, రణపంగ నాగయ్య, నూకల సుగుణమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : మహబూబాబాద్ కలెక్టరేట్ ఆవరణంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామ్ చందర్ నాయక్, ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విప్ ప్రజలను ఉద్దేశిస్తూ జిల్లా ప్రగతి గురించి వివరించారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన త్యాగధనులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విప్ డాక్టర్ జాటోత్ రామ్ చందర్ నాయక్ చేతులమీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యమురళీ నాయక్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె.వీర బ్రహ్మాచారి, డీఎఫ్ఓ విశాల్, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

తెర మీదకు సేనానులు?!

ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడవలసిన వారు మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని వివిధ ప్రాంతాలలో నిర్విరామంగా పర్యటిస్తూ ఆపరేషన్ సిందూర్ లో తమ ఘనత గురించి టముకు వేసి చెప్తూ ఉంటారు తప్ప పాకిస్థాన్ తో ఘర్షణలో మన యుద్ధ విమానాలకు, సేనలకు ఏమైనా నష్టం కలిగితే, ఆ నష్టం పరిధి ఎంత అని ప్రతిపక్షాలతో సహా ఎంతమంది ఎన్ని సార్లు అడిగినా సమాధానం చెప్పరు. ఈ విషయం చర్చించడానికి పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేయాలని ఎంత గట్టిగా కోరినా అవుననరు, కాదనరు. ప్రతిపక్షాల కోర్కెను, అభిప్రాయాన్ని మోదీ ఏ మాత్రం ఖాతరు చేయరు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ది అదేతంతు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసలు ఘర్షణ జరుగుతున్న సమయంలో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కానీ ఆ తరవాత అసలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే తీవ్రంగా స్పందించారు. ఈ రణగొణధ్వని మధ్య వాస్తవం ఏమిటో మాత్రం నిగూఢంగానే ఉండి పోయింది. కానీ ఈ మధ్యలో వాయుసేన అధిపతి అమర్ ప్రీత్ సింగ్, త్రివిధ దళాల అధిపతి అనిల్ సింగ్ చౌహాన్ ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి కొన్ని అంశాలు బయట పెట్టారు. పండిత్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజపేయి ప్రధాన మంత్రులుగా ఉన్నప్పుడు కూడా యుద్ధాలు జరిగాయి. కానీ ఎప్పుడూ సైనిక విభాగాల అధిపతులు బయటపడి వివరాలు తెలియజేసిన సందర్భమే లేదు. త్రివిధ దళాల అధిపతి అనిల్ సింగ్ చౌహాన్ అయితే ఆపరేషన్ సిందూర్ లో మనం కొన్ని యుద్ధ విమానాలు కోల్పోయామని సింగపూర్‌లో చెప్పారు. ఇది మరీ విడ్డూరం. గతంలో ఏ ప్రధానమంత్రి ఏ యుద్ధాన్నీ రాజకీయ దృక్కోణంతో చూడలేదు. యుద్ధాలలో గెలుపోటములను తమ రాజకీయ పార్టీ ప్రయోజనాల కోసం వినియోగించుకోలేదు. ఓటు బ్యాంకు కోసం వినియోగించుకోలేదు. అప్పుడు కూడా మీడియా ఉంది. ఇంత విస్తృతంగా లేకపోయి ఉండొచ్చు. ఇప్పుడు అధికార పక్షం ఒళ్లో కూర్చున్న మీడియా తానే యుద్ధం చేస్తున్నంతగా మిడిసి పడ్తోంది. అవాస్తవాలను ప్రచారంలో పెడ్తోంది. ప్రభుత్వానికి అనుకూల సమాచారం అందిస్తున్నామన్న భ్రమలో అసత్య ప్రచారానికి ఒడిగడ్తోంది. మూడు రోజుల ఘర్షణ తరవాత గత నెల పదో తేదీన కాల్పుల విరమణ జరిగితే గోదీ మీడియా చాలా బాధపడి పోయింది. మరికొన్నాళ్లు యుద్ధం కొనసాగితే బాగుండుననే రీతిలో వ్యవహరించింది. టీవీ స్టూడియోలలో ఇదివరకెన్నడూ యుద్ధాలు జరగలేదు. ఇప్పుడు టీవీ స్టూడియోలే యుద్ధ క్షేత్రాలు అయిపోయాయి. ఈ నేపథ్యంలోనే సైనికాధికారులు బయటపడి ఘర్షణ గురించి మాట్లాడక తప్పని పరిస్థితి ఏర్పడినట్టు కనిపిస్తోంది. రాజ్యాంగ ప్రతిపత్తి, స్వయం ప్రతిపత్తి గల సీబీఐ, ఎన్నికల కమిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ లాంటి సంస్థలు మోదీ హయాంలో రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను వదిలేసి మోదీ పనుపున పని చేయడం అలవర్చుకున్నాయి. యుద్ధం లేదా ఘర్షణలో మన రక్షణ దళాల పరిస్థితి ఏమిటి అని ఆయా రక్షణ విభాగాలకు చెందిన అధిపతులు బయటపడి వివరాలు అందించిన దాఖలాలే లేవు. మన రాజ్యాంగ వ్యవస్థలు...సైన్యం ఎన్నడూ తమంతట తాము ఏ వివరమూ బయట పెట్టినవి కావు. కానీ 2018 జనవరిలో అప్పటికి సుప్రీంకోర్టు సీనియర్ నాయమూర్తులైన జాస్తి చలమేశ్వర్, రంజన్ గొగోయ్, మదన్ బి. లోకూర్, కురియన్ జోసెఫ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి న్యాయ వ్యవస్థలో, ముఖ్యంగా సుప్రీంకోర్టులో ఉన్న లొసుగులను వెల్లడించారు. న్యాయమూర్తులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటి అని దేశమంతా నిర్ఘాంతపోయింది. ఆ తరవాత కూడా అనేకమంది న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తులు ప్రభుత్వ అనుకూలంగా వ్యవహరించి పదవీ విరమణానంతరం లాభసాటి అయిన పదవులు సంపాదించిన ఉదంతాలూ ఉన్నాయి.

త్రివిధ దళాల అధిపతి అనిల్ సింగ్ చౌహాన్ మన యుద్ధ విమానాలు కొన్ని కోల్పోయిన మాట నిజమేనని చెప్పడంలోనూ ఓ విచిత్రం ఉంది. ఆయన ఈ విషయం భారత అధికారిక మీడియా సంస్థ అయిన దూరదర్శన్‌తోనూ, ఆకాశవాణితోనూ చెప్పలేదు. సింగపూర్ వెళ్లి అక్కడి మీడియాతో మాట్లాడారు. ఈ అవసరం ఎందుకు వచ్చింది? 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో బంగ్లాదేశ్ అవతరించిన విషయాన్ని అప్పటి సైన్యాధిపతి జనరల్ మానెక్ షా దూరదర్శన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనే చెప్పారు. విదేశీ మీడియా సంస్థలతో ఈ విషయం చెప్పలేదని గుర్తుంచుకోవాలి. ఆకాశవాణిలోనూ ఆయన సందేశం ప్రసారం అయింది. ఇప్పుడూ దూరదర్శన్ ఉంది. ఆకాశవాణి ఉంది. మన యుద్ధ విమానాలకు జరిగిన నష్టం గురించి త్రివిధ దళాల అధిపతి అనిల్ సింగ్ చౌహాన్ సింగపూర్‌లో ఓ మీడియా సంస్థకు వివరాలు అందించినప్పుడు మరో మాట కూడా అన్నారు. "యుద్ధం" ఒక ఎత్తయితే మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టడానికి చాలా శ్రమ పడాల్సి వచ్చిందన్నారు. అంటే మన దేశంలోని మీడియా తన మాటలను వక్రీకరిస్తుందేమోనన్న భయం ఆయనకు ఉందనుకోవాలా! విచిత్రం ఏమిటంటే మే ఆరు-ఏడు అర్ధరాత్రి పాకిస్థాన్ మీద దాడి మొదలైన తరవాత లెక్కకు మిక్కిలిగా ఉన్న చానళ్లలో చర్చోపచర్చలు జరిగాయి. ఆ చర్చల్లో రక్షణ దళాల ప్రస్తావనే లేదు. ఏ విషయం చెప్పినా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వ అనుకూల దృష్టితోనే టీవీ చర్చలన్నీ జరిగాయి. క్రమశిక్షణకు మన సైన్యం పెట్టింది పేరు. మన సైన్యం ఎన్నడూ రాజకీయాలలో జోక్యం చేసుకోలేదు. మీడియా కూడా ఘర్షణల గురించి తమకు తోచిన సమాచారం, ప్రభుత్వ అనుకూల సమాచారం అందించిన ఉదంతాలూ గతంలో లేవు. ఇప్పుడే ఈ విపరీత పరిస్థితి కనిపిస్తోంది. మూడు రోజుల ఘర్షణ సందర్భంగా భారత, పాకిస్థాన్ దేశాల దగ్గర అణ్వాయుధాలు ఉండడం మీదకన్నా, ఈ ఘర్షణలో ప్రధాన పాత్ర పోషించిన మన వైమానిక దళానికి కలిగిన నష్టం మీద కన్నా, బోలెడు డబ్బు పోసి కొన్న రాఫెల్ యుద్ధ విమాల మీద కన్నా, రక్షణ దళాల పరాక్రమాన్ని కీర్తించడం కన్నా మోదీ సారథ్యంలో ప్రారంభించిన ఘర్షణను వేనోళ్ల పొగడడానికే ప్రధాన మీడియా సమయమంతా వెచ్చింది. ఈ హడావుడిలో సత్యాన్ని పాతర వేసేశారు. మోదీ ప్రభుత్వానికి అనుకూలమైన వార్తా సంస్థ ఏఎన్ఐ ప్రస్తుతం అనేక దేశాలలో పర్యటిస్తున్న భారత ప్రతినిధివర్గం వెంట తిరుగుతోంది. ఆ వార్తా సంస్థ కూడా సత్యానికి బారెడు దూరంలోనే సమాచారం అందిస్తోంది. కానీ ఈ వార్తా సంస్థకు కూడా అనిల్ సింగ్ చౌహాన్ ఇంటర్వ్యూ ఇవ్వలేదు. వైమానిక దళానికి కావాల్సిన సామాగ్రి సమయానికి అందడంలేదని వైమానిక దళాధిపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనా సీఐఐ సమావేశంలో ఈ మాట చెప్పారు తప్ప మన దేశంలోని మీడియా సంస్థతో చెప్పలేదు. వివరాలు చెప్పవలసిన ప్రభుత్వం మొహం చాటేస్తే పరిస్థితి ఇలాగే ఉంటుంది.

అమ్మో చెల్లెళ్లు!!

చింతపట్ల సుదర్శన్

మిట్ట మధ్యాహ్నం. రోడ్లు ఒంటరిగా తమతో తాము ముచ్చటించుకుంటున్నవి. అక్కడోటీ, ఇక్కడోటీ కరెంటు తీగల మీద కాకులు మేమున్నామని 'కావ్' భాషలో అరిచి చెప్తున్నవి. డొక్క ఎగరేస్తూ నడుస్తున్న డాగీకి హఠాత్తుగా ఓ గల్లీలో నుంచి రోడ్డు మీదకి వస్తున్న వనిత కనిపించింది. ఆమె చేతిలో ఓ బ్యాగు ఉంది. ఆ బ్యాగులో తను తినడానికి ఏమైనా ఉండి ఉండునా అనుకుంది డాగీ. ఆ ఆలోచనకు సిగ్గు పడింది. కానీ, 'నేరం నాది కాదు ఆకలిది' అనే మాట గుర్తుకు వచ్చి ఆ ఆడ మనిషి వెనకే అడుగులో అడుగు వేసింది. ఉదయం నించీ పొట్ట సంచీలో ఏమీ పడకపోవడంతో కళ్లు గుండ్రాలు తిరుగుతున్నవి. లాభం లేదు బతికి ఉండడం ముఖ్యం. బతికి ఉండాలంటే ఆ బ్యాగును చోరీ చెయ్యడం అవసరం అనుకుంది.

అర్ధరాత్రి బయట క్షేమంగా తిరగలేని మహిళ మిట్ట మధ్యాహ్నం

రంగస్థలం

నిర్జన రోడ్డు మీద నిశ్చింతగా నడుస్తున్నది. ఒక్క గెంతు అలా గెంతితే సరి. ఆమె సంచీ విసిరి పారేసి పారిపోతుంది. దొంగతనం తప్పో రైటో అని ఆలోచించే ఓపికా తీరికా లేవు అనుకుంటున్న డాగీకి తన వెనుక ఎవరో వస్తున్న చప్పుడు వినిపించి వెనక్కి తిరిగింది. ఆ వస్తున్నది మరెవరో కాదు డాంకీనే. 'హాయ్ డాంకీ హౌ ఆర్ యూ?" అంది డాగీ ఆకలితో ఉన్నా మర్యాద తప్పకుండా. 'ఏం చెప్పనురా తంబీ' అయాం హంగ్రీ! నవలడానికేమీ దొరకలేదు. ట్యాంక్ ఖాళీ అవడం వల్ల కళ్లకి పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నయి' అంది డాంకీ. అంటే మనిద్దరి అతీగతీ ఒక్కటేనన్నమాట. నేనా నడుస్తున్న అమ్మాయి బ్యాగు మీద కన్నేశాను అందులో బన్నేమైనా ఉందేమోనని ఆశిస్తున్నాను అంది డాగీ. డాంకీ ఆ బ్యాగు వైపు చూసింది. నీ ఊహ తప్పురా తమ్ముడూ ఆ బ్యాగులో ఏవో కాగితాలు ఉండి ఉంటాయి. అది నాకు పనికి వచ్చే 'లంచ్ బాక్సులా' కనిపిస్తున్నది అంది డాంకీ ఆశగా.

నో యూ ఆర్ రాంగ్! అంటూ సడన్‌గా జంపుచేసి ఆ ఆడమనిషి చేతిలోనుంచి బ్యాగు లాక్కుని రేసు గుర్రమై పోయింది డాగీ. ఆ స్త్రీ ఈ సడన్ అటాక్‌కి షాక్‌కి గురయి నోరు తెరిచింది, కానీ అరవటం మరచిపోయింది. బ్యాగు అందుకుపోయిన డాగీ దాన్ని ఓపెన్ చేసి అందులో బన్నుకి బదులు కాగితాల కట్టనుచూసి ఉసూరుమంటూ ఉంటుంది అనుకుంటూ వెళ్లి అరుగు ఎక్కింది డాంకీ. వచ్చావా బ్రో ఏమిటింత లేటు నీ మాటే రైటు. బ్యాగులో బన్ను లేదు అంది డాగీ. అయితే కాగితాల కట్టేదీ అంది చుట్టూ చూస్తూ డాంకీ. అదీ లేదు, మన ఇద్దరి అంచనా బోల్తాపడ్డది. ఖాళీ బ్యాగు చూసి తిక్క ఎక్కి చింపి పోగులు పోశా చూడు గాలిలో ఎగురుతున్న బ్యాగు అవశేషాల్ని అంది డాగీ. ఆ దారంటపోతున్న అబ్బాయి డాగీని డాంకీని చూసి అరుగు ఎక్కేడు.

ఏంటిద్దరూ అర్లీగా వచ్చి అరుగు ఎక్కారు అన్న అబ్బాయి వైపు వేలాడ్తున్న ముఖాల్లో చూశాయవి. ఏం చెప్పం 'బ్రో' కడుపు నకనక లాడ్తున్నదని ఓ మహిళ బ్యాగు ఎత్తుకొచ్చేను నేనే అంది డాగీ. అందులో బన్నూ లేదు పేపర్ల కట్టాలేదు. ఇవాళ మాకిద్దరికీ తిండానికి ఏమీ దొరకనూ లేదు అంది డాంకీ. ఏంటీ పట్టపగలు ఓ ఆడమనిషి చేతి నుంచి బ్యాగును కొట్టుకొచ్చారా ఎంత ధైర్యం మీకు. రెండు రాష్ట్రాలలోనూ 'చెల్లెమ్మలు' వీరంగం చేస్తున్న ఈ టయంలో మీరు చేసిన పని క్షమించరాని సంగతి. అదృష్టం బావుండి ఆ యమ్మి తిట్ల దండకం వినకుండానే వచ్చేశారన్న మాట అన్నాడు అబ్బాయి.

అవునా ఆ చెల్లెమ్మ తిట్ల దండకం చదివే ఉంటుందంటావా? అంది డాగీ. ఎన్ని బూతులు తిట్టేసి ఉంటుందో అయినా ఉత్తుత్తి బ్యాగుకి కూడా తినాల్సిందేనా బోలెడు తిట్లూ, చాటెడు శాపనార్థాలు అంది డాంకీ. ఓ చెల్లెమ్మ ఎప్పుడో నడుం చుట్టూ కొంగుతిప్పి నోరు తెరిచింది. ఈ మధ్యే జైలు తిండి ఒంట బట్టించుకు వచ్చిన మరె చెల్లెమ్మ అన్నను బతుకమ్మ ఆట ఆడిస్తానంటున్నది. ఆ చెల్లెళ్ల ఘోష గోడు గగ్గోలు మీకు వినిపించనే లేదా? అన్నాడు అబ్బాయి. జైలుకు వెళ్లి వచ్చిన వాళ్లూ, పాదయాత్రలు చేసిన వాళ్లూ పదవుల్లోకి గ్యారంటీగా వస్తారన్న నమ్మకమే ఈ సోదరీమణుల సునామీకి కారణం కావచ్చు అంది డాంకీ. రాఖీ కట్టి అన్నయ్య నోటికి స్వీటు అందించే చెల్లెళ్లు, 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి' అని పాడాల్సిన చెల్లెళ్లు నల్లి కుట్లోళ్లని, నాలి ముచ్చోళ్లని అన్నయ్యలను ఆడిపోసుకోవడం ఏం బాగులేదు అంది డాగీ. రాజకీయాల్లో చుట్టరికాలకు చుక్కెదురే మరి 'అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం' అన్నాడుగా ఓ కవి అన్నాడు అబ్బాయి.

బంగాళాఖాతంలో వాయుగుండం, వాతావరణ శాఖ కనిపెట్టవచ్చు నేమో కాని, చెల్లెళ్లు తిరుగుబాటు బావుటాలు ఎగరేసే విషయం ఎవరూ కనుక్కోలేరనుకుంటా అంది డాగీ. 'లేచింది నిద్ర లేచింది చెల్లెళ్ల లోకం' అని పాట అందుకుంది డాంకీ. ఏది ఏమైనా అక్కచెల్లెమ్మల జోలికి పోకండి. వారి ఖాళీబ్యాగుల్లో పెప్పర్ స్ప్రేలుండే ఛాన్సు కూడా ఉందని మరచిపోకండి అంటూ అరుగు దిగాడు అబ్బాయి.

కంటి తుడుపుగా మద్దతు ధరలు...!

కేవీవీ ప్రసాద్

నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోమారు అన్నదాతల వెన్నెముక విరిచే ప్రయత్నం చేసింది. మే 30న కేంద్రం ప్రకటించిన 14 రకాల పంటల మద్దతు ధరల పెంపు తీరు ఏమాత్రం ఆశాజనకంగాలేదని రైతాంగం పెదవి విరుస్తు న్నారు. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయంతో ఏ మాత్రం పొంతన లేకుండా కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు ఉన్నాయని సర్వే సర్వత్రా అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలు కిసాన్ సంయుక్త మోర్చా నాయకత్వంలోని వివిధ రైతు సంఘాలు, వ్యవసాయరంగ నిపుణులు చివరకు సీఏసీపీ (వ్యవసాయం ఖరీదు, ధరల కమిషన్) సూచనలు సైతం పట్టించుకోకుండా కేంద్రం మద్దతు ధరలు ప్రకటించిన తీరు ఏ మాత్రం సమంజసం కాదు.

వ్యవసాయరంగ సంక్షోభాన్ని నివారించేందుకు, ఆత్మహత్యల నివారణకు 2006లో నియమించిన జాతీయ రైతు కమిషన్ చైర్మన్ డా.ఎంఎస్ స్వామినాథన్ చేసిన విలువైన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. పంట ఉత్పత్తి వ్యయానికి 50శాతం అదనంగా కలిపి (సీ2+50%) మద్దతు ధర నిర్ణయించాలన్న ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. 2014 ఎన్నికల సందర్భంగా స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామన్న వాగ్దానం గాలిలో కలిపింది మోదీ ప్రభుత్వం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రథమ ఎన్నికల హామీ సైతం మోసపూరిత మని ఆచరణలో రుజువైంది.

2026 ఖరీఫ్ పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు ఏ మాత్రం ఆమోదయోగ్యంకాదు. వరి మద్దతు ధర క్వింటాకు కేవలం 69రూపాయలకు భారీగా పెంచినట్లు బీజేపీ దాని భాగస్వామ్య పక్షాలు స్వీయభజన చేసుకుంటున్న తీరు అత్యంత ఆక్షేపణీయం. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం క్వింటా వరి ధాన్యం 3135 రూపాయలు లభించాలి. అయితే ప్రభుత్వం ప్రకటించింది 2369 రూపాయలు మాత్రమే. ప్రతి క్వింటాకు 766రూపాయలు రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో ప్రకటించిన మద్దతుధర కన్నా ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర అధనంగా మూడు శాతం మాత్రమే. కానీ ప్రతి సంవత్సరం ఉత్పత్తి ఖర్చులు 10 నుంచి 15శాతం పెరుగుతున్నట్లు వ్యవసాయరంగ నిపుణుల అంచనా. ఒక్క రాగి పంటకు 13.89శాతం పెంచారు. మిగిలిన పంటలన్నింటికి 10శాతం లోపుగానే మద్దతు ధరలు పెరిగాయి. కేంద్రం పెంచిన మద్దతు ధరల తీరు ఎంత మోసపూరితమో స్పష్టమౌతున్నది.

ప్రకటించిన మద్దతు ధరల ప్రకారం కూడా రైతుల నుంచి

> 2014 ఎన్నికల సందర్భంగా స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామన్న వాగ్దానం గాలిలో కలిపింది మోదీ ప్రభుత్వం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రథమ ఎన్నికల హామీ సైతం మోసపూరిత మని ఆచరణలో రుజువైంది. మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 2014 నుంచి ఒక లక్షా ఇరవై వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే మోదీ ప్రభుత్వ నిర్వాకం ఏ పాటిదో అవగతమౌతున్నది.

కొనుగోలు జరగడంలేదు. ప్రతి సంవత్సరం మద్దతు ధరలు లభించక మన దేశ రైతాంగం సుమారు 3 లక్షల కోట్లు నష్టపోతున్నట్లు అనేక సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయి. మన రాష్ట్రంలో మిర్చి, పొగాకు, పసుపు, అయిల్ పామ్ మొదలకు వాణిజ్య పంటలు, మామిడి, సపోట, ఆరటి, బొప్పాయి తదితర ఉద్యాన పంటలకు తక్కువ ధరల లభ్యత, ప్రకృతి వైపరీత్యాలవల్ల మన రాష్ట్ర రైతాంగం 40 వేల కోట్లు నష్టపోతున్నది. నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ప్రభావం కేంద్ర ప్రభుత్వ దిగుమతి, ఎగుమతి విధానాలు రైతాంగాన్ని మరింత నష్టాల్లో ముంచెత్తుతున్నాయి.

1995-2022 మధ్యకాలంలో దేశ వ్యాపితంగా 3,96,438 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పాలకుల విధానాలు వ్యవసాయ రంగానికి భరోసా ఇవ్వని కారణంగా ప్రతిరోజూ దేశ వ్యాపితంగా 32మంది రైతులు ఆత్మహత్యల పాలౌతున్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 2014 నుంచి ఒక లక్షా ఇరవై వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే మోదీ ప్రభుత్వ నిర్వాకం ఏ పాటిదో ఆవగతమౌతున్నది. డా॥ ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం లభించాల్సిన మద్దతు ధరలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యత్యాసంతో నష్టపోతున్న తీరు పట్టిక

వ.నెం.	పంటలు	స్వామినాథన్ సీ2+50% రూ॥ క్వింటాల్‌కు	ప్రభుత్వ ఎంఎస్‌పీ రూ॥ క్వింటాల్‌కు	తేడా రూ॥క్వింటాల్‌కు
01.	వరి	3,135	2.369	766
02.	మొక్కజొన్న	3,103	2,400	704
03.	జొన్న	4,809	3,699	1,110
04.	సజ్జ	3,600	2,775	825
05.	రాగి	5,964	4,886	1,078
06.	కంది	10,874	8,000	2,874
07.	శనగ		5,650	
08.	మినుము	10,448	7,800	2,648
09.	పెసర	11,214	8,768	2,446
11.	పత్తి	10,075	7,710	2,365

గత సంవత్సరం స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం లభించాల్సిన మద్దతు ధరలు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల వ్యత్యాసం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వరికి 8010 కోట్లు, మొక్క జొన్న 1037 కోట్లు, జొన్న 3233 కోట్లు, సజ్జ 150.6 కోట్లు, రాగి 30.8 కోట్లు, కంది 216.8 కోట్లు, శనగ 396 కోట్లు, మినుము 803 కోట్లు, పెసర 132 కోట్లు నష్టపోవాల్సి వచ్చింది.

చెరకు, పత్తి, వేరుశనగ, మిర్చి, పొగాకు పండించిన రైతులు వేల కోట్లలో నష్టపోయారంటే అతిశయోక్తి కాదు. అందువల్లనే రైతులు, రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు, రాజకీయ పార్టీలు, డా.ఎంఎస్ స్వామినాధన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతున్నాయి. ఆందోళన చేస్తున్నాయి. రైతన్నలారా మద్దతు ధరల సాధనకు ఉద్యమించండి. వ్యవసాయాన్ని కాపాడండి.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి
సెల్ నం : 9490952737

పలస్తీనాలో స్థైర్యం నింపిన మేఘా

జేజేసీపీ బాబూరావు

అమెరికాలోని ప్రతిష్ఠాత్మక మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) లో అభ్యసించిన భారత సంతతి విద్యార్థిని మేఘా వేమూరి గత నెల 29న 'గ్రాడ్యుయేషన్ డే' సందర్భంగా ప్రసంగిస్తూ ప్రధానంగా పలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధ చర్యలను 'నరమేథం'గా పేర్కొనడం ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించారు. ఈ రకంగా పలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను విమర్శిస్తూ ప్రసంగించడం ద్వారా పలస్తీనాకు అండగా నిలిచిన మేఘా వేమూరిని ఎంఐటీ గ్రాడ్యుయేషన్ వేడుకల నుంచి బహిష్కరించినట్లు ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మెలిసా నోబెల్స్ ప్రకటించి ఆమెతోపాటు ఆమె తల్లితండ్రులను సైతం క్యాంపస్ నుంచి బయటకు పంపించడం అప్రజాస్వామికం. నిజానికి అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా వెలుగొందుతున్న అమెరికాలో ఈ తరహా ఘటన చోటుచేసుకోవడం 'అప్రజాస్వామ్యానికి' నిదర్శనంగా నిలిచింది అని చెప్పవచ్చు. నిజానికి 'ప్రజాస్వామిక దేశం' అని గొప్పగా చెప్పుకునే అమెరికా దేశం చరిత్ర మొత్తం అప్రజాస్వామికం.

గాజాలో ఒక పక్క ఇజ్రాయిల్ భీకర దాడులు కొనసాగిస్తున్న తరుణంలోను, మరోపక్క విశ్వవిద్యాలయాల సంబంధాల గురించి అమెరికాలోని కళాశాల క్యాంపస్‌లలో నిరసనలు పెల్లుబికుతున్న తరుణంలోనూ వేదిక నుంచి భారతీయ-అమెరికన్ విద్యార్థిని మేఘా వేమూరి ఇజ్రాయిల్-పలస్తీనా సంఘర్షణపై బలమైన రాజకీయ విమర్శనాత్మకమైన వ్యాఖ్యలు చేయడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. ఈ తరుణంలో మేఘా వేమూరి చూపిన ధైర్యాన్ని ప్రపంచ ప్రజానీకం ప్రశంసిస్తూనే ఉన్నారు. మేఘా వేమూరి తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. ఆమె జార్జియా (అమెరికా) లోని ఆల్ఫారెట్టాలో పుట్టి పెరిగారు. ఆమె 2021 లో ఆల్ఫారెట్టా హై స్కూల్ నుంచి పట్టభద్రురాలయ్యారు. అదే సంవత్సరం ఆమె ఎంఐటీలో చేరి కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, భాషాశాస్త్రంలో ట్రిపుల్ మేజర్‌తో తన అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేశారు. గ్రాడ్యుయేటింగ్ క్లాస్ అధ్యక్షురాలిగా ఆమె కొనసాగుతున్నారు. మెక్‌గోవర్న్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్‌లో రీసెర్చ్ అసిస్టెంట్‌గాను ఆమె వ్యవహరించారు. మేఘా వేమూరి 2021లో నేషనల్ మెరిట్ స్కాలర్ అవార్డు పొందారు. తన విద్యా విజయాలకు మించి విప్లవాత్మక ఆలోచనలకు వేదికను అందించాలనే లక్ష్యంతో ఉన్న ఆమె ఎంఐటీ విద్యార్థి బృందం అయిన రిటర్న్ రెవల్యూషన్‌లోను సభ్యురాలుగా ఉన్నారు.

ఇటీవలి కాలంలో పలస్తీనా అనుకూల, ఇజ్రాయిల్ వ్యతిరేక నిరసనలు

> ఒక జాతి విధ్వంసాన్ని ప్రజలు ఏమాత్రం సహించలేరు. ఎంఐటీ స్వేచ్ఛా పలస్తీనాను కోరుకుంటుందని మీరు ప్రపంచానికి చూపించారు' అని మేఘా వేమూరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించడం నిజంగా అద్భుతం. అంతిమంగా మేఘా వేమూరి ఎంఐటీ గ్రాడ్యుయేషన్ దే సందర్భంగా 'స్వేచ్ఛా పలస్తీనా కోసం చేసిన ప్రసంగం ప్రపంచ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది'

తీవ్రతరం అవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే మేఘా వేమూరి 'స్వేచ్ఛా పలస్తీనా' కోసం గళమెత్తారు. పలస్తీనా సంఘీ భావానికి ప్రతీకగా మేఘా వేమూరి ఎరుపు కెఫియే(హిజాబ్ వంటిది) ధరించి గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆమె ప్రసంగ వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఈ రకంగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా మేఘా వేమూరి చేసిన విమర్శలను కొందరు వ్యతిరేకించారు. అయితే ఎంఐటీ గ్రాడ్యుయేషన్ వేడుకను రాజకీయ మైదానంగా ఆమె ఉపయోగించారని మరికొందరు అభ్యంతరాలు వ్యక్తీకరించారు. మేఘా వేమూరి తన ప్రసంగంలో పలస్తీనియన్లకు బలంగా సంఘీభావాన్ని ప్రకటించారు. 'పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడికి అమెరికా మాత్రమే కారణం కాదు. మన యూనివర్సిటీ కూడా సహాయం చేస్తూ ప్రోత్సహిస్తూనే ఉంది. కాని ఇది సరైన విధానం ఏమాత్రం కాదు' అని మేఘా వేమూరి తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయిల్‌తో తమ వర్సిటీ చేసుకున్న ఒప్పందాలను ఆమె అంతే తీవ్రంగా వ్యతిరేకించారు. పలస్తీనాను పూర్తిగా తుడిచిపెట్టడానికి ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నాలలో ఎంఐటీ భాగం కావడం సిగ్గుచేటు. అలాగే ఇజ్రాయిల్ సైనిక సంస్థలతో రీసెర్చ్ సంబంధాలను కొనసాగిస్తోంది. ఇది గాజాలో జరుగుతున్న హింసకు సహాయం చేస్తుందని ఆమె ఘాటుగా విమర్శించారు. మసాచుసెట్స్ వర్సిటీ విద్యార్థులు అటువంటి హింసాకాండను ఎటువంటి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తేలేదు. జాతి విధ్వంసాన్ని అసలే హర్షించరు. అలాంటి జాతి విధ్వంసక ఇజ్రాయిల్ సైన్యంతో సంబంధాలను తెంచుకోవాలి' అని ఆమె స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు ఎంఐటీ విద్యార్థులు పిలుపు ఇవ్వడం శుభపరిణామం. ఈ క్రమంలోనే విద్యార్థులు శాంతికోసం ముందుకు సాగడం గమనార్హం. ఎంఐటీ యాజమాన్యం అనుకూల పలస్తీనా ఉద్యమకారులను బెదిరింపులు, భయపెట్టడం, అణచివేతల ద్వారా అడ్డుకుంటూనే ఉంది. అయిననూ వారు వెనకడుగు వేయడం లేదు. ఇజ్రాయిల్ దాడిలో పలస్తీనా ఒక రకంగా నాశనం అయిపోయింది. అక్కడి ప్రజలు బాంబు దాడులతో, ఆకలితో చనిపోతూ ఉన్నారు. మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి జీవితాలను మరింతగా ముందుకు కొనసాగిస్తున్నాం. మా జీవితాలను శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగాను, విద్యావేత్తలుగాను, నాయకులుగాను తీర్చిదిద్దుకుటున్నాం. కాని గాజాలో ఇప్పుడు ఒక్క విశ్వవిద్యాలయం కూడా మిగలలేదు. అందువలన పూర్వ విద్యార్థులుగా ఇజ్రాయిల్‌తో సంబంధాలను తెంచుకోవాలి అని వర్సిటీని డిమాండ్ చేస్తూనే ఉంటాం' అని మేఘా వేమూరి పేర్కొన్నారు.

విశ్వవిద్యాలయ అధికారుల నుంచి బెదిరింపులు, అణచివేతలను ఎదుర్కొంటున్నప్పటికీ 'విద్యార్థులు పలస్తీనాకు మద్దతుగా నిలవడం నూతన సమాజ నిర్మాణానికి బాటలు వేయనుంది' అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. 'అమెరికా లోని చాలామంది విద్యార్థుల హృదయాలలో భయాందోళనలు గూడుకట్టుకుని ఉండేవి. మీరు ఇంతకు ముందు భయం అనే అడ్డంకిని ఎదుర్కొన్నారు. సరైన దాని కోసం నిలబడటానికి మీరు దానిని ఇంధనంగా మార్చారు. ఒక జాతి విధ్వంసాన్ని ప్రజలు ఏమాత్రం సహించలేరు. ఎంఐటీ స్వేచ్ఛా పలస్తీనాను కోరుకుంటుందని మీరు ప్రపంచానికి చూపించారు' అని మేఘా వేమూరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించడం నిజంగా అద్భుతం. అంతిమంగా మేఘా వేమూరి ఎంఐటీ గ్రాడ్యుయేషన్ దే సందర్భంగా 'స్వేచ్ఛా పలస్తీనా కోసం చేసిన ప్రసంగం ప్రపంచ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది' అని సగర్వంగా చెప్పవచ్చు.

రీసెర్చ్ స్కాలర్, సెల్: 94933 19690

'థగ్‌లైఫ్' కోసం హైకోర్టుకెక్కిన కమల్ హాసన్

బెంగళూరు: తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. ఈ నేపథ్యంలో కమల్ హాసన్ తాజా చిత్రం 'థగ్‌లైఫ్' ప్రదర్శనను నిషేధిస్తున్నట్లు కర్నాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటించింది. ఈ విషయమై కమల్ హాసన్ తాజాగా కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. తన రాబోయే చిత్రం థగ్‌లైఫ్‌ను రాష్ట్రంలో విడుదల చేసి ప్రదర్శించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. తన నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. సినిమా విడుదలను అడ్డుకోవద్దని కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు శాఖ, చలనచిత్ర వాణిజ్య సంస్థలను ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. కర్నాటక రక్షణ వేదికతో పాటు పలు ప్రజా సంఘాలు కమల్ వ్యాఖ్యలపై భగ్గుమన్నాయి. మే 30లోగా క్షమాపణలు చెప్పకపోతే 'థగ్‌లైఫ్'ను బహిష్కరిస్తామని కర్నాటక ఫిల్మ్ ఛాంబర్ ఆ అల్టిమేటం జారీచేసింది. తాము విధించిన గడువు ముగిసినా సరైన స్పందన రాకపోవడంతో 'థగ్‌లైఫ్' చిత్రాన్ని బ్యాన్ చేస్తున్నట్లు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం తీసుకుంది.

నేను చప్పట్లు కొట్టలేదు

శివరాజ్‌కుమార్

బెంగళూరు: ఇటీవల జరిగిన 'థగ్ లైఫ్' ఈవెంట్‌లో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. అయితే అదే ఈవెంట్‌లో కమల్ హాసన్ కన్నడ భాష గురించి మాట్లాడే సమయంలో ఆ వ్యాఖ్యలకు శివరాజ్ కుమార్ చప్పట్లు కొట్టారంటూ కొన్ని కథనాలు వచ్చాయి. తాజాగా దీనిపై ఆయన స్పష్టత ఇచ్చారు. తాను ఆ సమయంలో చప్పట్లు కొట్టలేదని తెలిపారు. తమిళం నుంచే కన్నడ పుట్టిందంటూ కమల్ వ్యాఖ్యానించగా శివరాజ్ చప్పట్లు కొడుతున్నట్లు చూపించారు. దీంతో ఆయన ఆ వ్యాఖ్యల్ని ప్రోత్సహిస్తున్నారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని గురించి తాజాగా శివరాజ్ మాట్లాడుతూ... "అన్ని భాషలు ముఖ్యమైనవే. కానీ, నా మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తాను. దాంట్లో ఎలాంటి సందేహం లేదు. నేను ఇంతకుముందు కూడా ఇదే చెప్పాను. కన్నడ కోసం నా ప్రాణమైనా ఇస్తాను. కానీ, నేను ఈ విషయం గురించి చెప్పకూడదు (కమల్ హాసన్ క్షమాపణలు చెప్పాలి అని). ఎందుకంటే ఆయన చాలా సీనియర్ నటుడు. నేను ఆయనకు వీరాభిమానిని. ఇక ఆ ఈవెంట్‌లో ఏం జరిగిందో నాకు అర్థం కాలేదు. ఆ వ్యాఖ్యల సమయంలో చప్పట్లు కొడుతున్నట్లు చూపించారు. నేను అప్పుడు క్లాప్స్ కొట్టలేదు. వేరే స్పీచ్ సమయంలో కొట్టాను. అది ఎడిటింగ్‌లో అలా వచ్చింది" అని చెప్పారు.

ఈశాన్య రాష్ట్రాలను ఆదుకోవాలి

మోదీ సర్కారుకు ఖర్గే విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలలో వరద పరిస్థితిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం కేంద్రంలోని మోదీ సర్కారుపై విమర్శలు చేశారు. 2016లో అసోంను వరద రహితంగా చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని... కానీ బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అసోంను మోసం చేసినట్లు అనిపిస్తోందని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలు తీవ్ర ముప్పు ఎదుర్కొంటున్నా కూడా మోదీ సర్కారుకు పట్టడం లేదన్నారు. ఈ మేరకు 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఈశాన్య ప్రాంతం వినాశకరమైన వరదలు, కొండచరియలు విరిగిపడటం, భారీ వర్షాలతో అతలాకుతలమవుతోందని పేర్కొన్నారు. అసోం, అరుణాచల్, మణిపూర్, సిక్కిం, మేఘాలయ అత్యంత ప్రభావితమైన రాష్ట్రాలలో ఉన్నాయి. అక్కడ అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షలాది మంది ప్రజలు ప్రభావితమయ్యారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్మికులు ప్రజలకు సహాయం అందించడానికి ప్రతిదీ చేయాలన్నారు. '2016లో బీజేపీ 'వరద రహిత' అసోంను చేస్తామని హామీ ఇచ్చింది. 2022లో హోం మంత్రి అమిత్ షా ఈ హామీని పునరావృతం చేశారు' అని పేర్కొన్నారు. 'స్మార్ట్ సిటీ' అని పిలవబడే గువహటి నుంచి వచ్చే దృశ్యాలను చూస్తుంటే మోదీ జీ, అతని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు అసోంను ఎలా మోసం చేశాయో గుర్తుకు వస్తుంది' అని ఖర్గే తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ప్రాథమిక అభివృద్ధి సమస్యల నుంచి భావోద్వేగ, విభజన అంశాలకు మళ్లింపు, పరధ్యానం, మళ్లింపు బీజేపీ రాజకీయాల ముఖ్య లక్షణం' అని అన్నారు. మోదీ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలన్నిటికీ, ప్రత్యేకించి అసోంకు సంసిద్ధత కోసం మరిన్ని నిధులను విడుదల చేయాలని తెలిపారు. అసోం, మేఘాలయ, మణిపూర్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలో అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల తర్వాత వరద పరిస్థితి భయంకరంగా ఉంది.

ఉచిత ఆధార్ అప్‌డేట్‌కు

తుది గడువు జూన్14

న్యూఢిల్లీ: నేటి సమాజంలో ఆధార్ కార్డు వినియోగం ఎంతో కీలకంగా మారింది. సిమ్ కార్డు కొనుగోలు మొదలు బ్యాంకు ఖాతాలు తెరవడం, వాహనాలు, ఇళ్లు, భూముల క్రయ విక్రయాలు, ప్రభుత్వ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి వాటికి అధార్ తప్పనిసరి అయింది. వయసు పెరుగుతున్న కొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం... దీంతోపాటు ఇంటి చిరునామాలు మారుతుండడంతో అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించేందుకు ఆధార్‌లో మార్పులు, చేర్పులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఎప్పటికప్పుడు అవకాశం కల్పిస్తూ వస్తున్నది. ఈ క్రమంలోనే పదేళ్ల క్రితం నాటి ఆధార్ కార్డుల్లోని వివరాలను ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి 2025, జూన్ 14 వరకు గడువు ఇచ్చింది. ఉడాయ్ ఇచ్చిన గడువు మరో పది రోజుల్లో ముగియనుంది. ఇప్పటికీ వివరాలు అప్‌డేట్ చేసుకోని వారు ఉడాయ్ అధికార వెబ్‌సైట్ http://myaadhar.uidai.gov.inలో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ సాయంతో లాగిన్ అయి వివరాలను ఉచితంగానే అప్‌డేట్ చేసుకోవచ్చు.

ఎన్సీపీకి ఎదురుదెబ్బ

- నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీలో చేరిన ఏడుగురు ఎమ్మెల్యేలు
- అసంతృప్తి ఉందని అంగీకరించిన అజిత్ పవార్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) కి పెద్ద రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. నాగాలాండ్‌లోని ఏడుగురు ఎన్సీపీ ఎమ్మెల్యేలు నాగాలాండ్ లోని అధికార నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) లోకి ఫిరాయించారు. ఎన్సీపీ ఎమ్మెల్యేలు చేరడం వల్ల రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి నీఫియు రియో పార్టీ బలం పెరిగింది. ఎన్‌డీపీపీకి సొంతంగా స్పష్టమైన మెజారిటీ లభించింది. ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ పరిణామాన్ని ధ్రువీకరించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు లేకపోవడం, రాజకీయంగా పట్టు కొరవడటంతో ఏడుగురు ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అంగీకరించారు. 'సుమారు రెండు నుంచి మూడు నెలల క్రితం మా నాగాలాండ్ పార్టీ విభాగం నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు నన్ను కలవడానికి వచ్చారు. వారు అక్కడ సమస్యలను ఎదుర్కొంటున్నారని వారు నాకు చెప్పారు. వారి కోసం క్షేత్రస్థాయిలో ఎటువంటి పని జరగడం లేదు' అని పవార్ చెప్పారు. 'వారి ఆందోళనల గురించి నేను అక్కడి ముఖ్యమంత్రితో కూడా మాట్లాడాను. అవును, వారిలో అసంతృప్తి ఉంది. అది చాలావరకు నిజమే' అని ఆయన అన్నారు. దీనిపై మరింత సమాచారం తీసుకుంటానని తెలిపారు. 'రెండు రోజులుగా నేను అనారోగ్యంతో ఉన్నాను. అందువల్ల దాని గురించి నాకు పెద్దగా సమాచారం లేదు. కానీ ఇప్పుడు నాగాలాండ్‌లో జరిగిన పరిణామాల గురించి మరింత వివరణాత్మక సమాచారాన్ని సేకరించడం ప్రారంభించాను' అని చెప్పారు. ఏడుగురు శాసన సభ్యులు సమష్టిగా ఫిరాయించడంతో రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద మినహాయింపు కోసం చట్టపరమైన షరతు నెరవేరినందున, ఈ కేసులో ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదని కూడా పవార్ స్పష్టం చేశారు. 'ఏడుగురు ఎమ్మెల్యేలు కలిసి అధికార పార్టీలో చేరినందున, ఫిరాయింపుల నిరోధక చట్టం అమలులోకి రాదు' అని ఆయన పేర్కొన్నారు.

భారత్‌లో కార్ల తయారీపై టెస్లాకు ఆసక్తి లేదు

కేంద్ర మంత్రి కుమారస్వామి

న్యూఢిల్లీ: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా, భారత్‌లో కార్ల ఉత్పత్తి చేపట్టేందుకు ప్రస్తుతానికి సుముఖంగా లేదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి స్పష్టం చేశారు. అయితే, దేశీయంగా తమ అమ్మకాల కోసం షోరూమ్‌లను ఏర్పాటు చేయడానికి మాత్రం కంపెనీ ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల (ఈవీ) తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకొచ్చిన నూతన పథకం మార్గదర్శకాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో కుమారస్వామి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "టెస్లా కేవలం షోరూమ్‌లు నెలకొల్పడం పైనే దృష్టి సారించింది. భారత్‌లో కార్ల తయారీకి ఆ సంస్థ ఇష్టపడటం లేదు. ఈ దిశగా వారి నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనగానీ, ఆసక్తిగానీ వ్యక్తమవలేదు" అని తెలిపారు. అంతేకాకుండా, భారత ప్రభుత్వం విద్యుత్తు కార్ల తయారీ ప్రోత్సాహక పథకంపై నిర్వహించిన చర్చల్లో కూడా టెస్లా ప్రతినిధుల భాగస్వామ్యం పరిమితంగానే ఉందని ఆయన గుర్తు చేశారు. "ఈ పథకానికి సంబంధించిన భాగస్వాములతో జరిగిన సమావేశాల్లో టెస్లా ప్రతినిధులు కేవలం తొలి విడత చర్చలకు మాత్రమే హాజరయ్యారు. ఆ తర్వాత జరిగిన రెండు, మూడో విడత చర్చల్లో వారు పాల్గొనలేదు" అని కుమారస్వామి పేర్కొన్నారు. కాగా, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ గత ఏడాది ఏప్రిల్ నెలలో భారత్‌లో పర్యటించాల్సి ఉండగా, కంపెనీ కార్యకలాపాల కారణంగా ఆ పర్యటన రద్దయిన విషయం తెలిసిందే. కాగా టెస్లా భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

కేంద్రం హెచ్చరికతో వెనక్కు తగ్గిన రైడ్ హెయిలింగ్ యాప్స్

న్యూఢిల్లీ: క్యాబ్ బుకింగ్ కోసం ముందస్తు టిప్ చెల్లించే విధానంపై రైడ్ హెయిలింగ్ యాప్స్ వెనక్కు తగ్గాయి. తమ యాప్స్‌లోని అడ్వాన్స్ టిప్ ఆప్షన్ స్థానంలో ఐచ్ఛిక, స్వచ్ఛంద టిప్ ఆప్షన్‌లు ఉండేలా సంస్థలు అప్‌డేట్స్ చేస్తున్నట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. 'ముందస్తు టిప్‌లు వసూలు చేస్తున్న క్యాబ్ సర్వీస్ ప్రొవైడర్లపై కేంద్రం దృష్టి పెట్టింది. సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ హెచ్చరిక తరువాత సంస్థలు తమ యాప్స్‌ను అప్‌డేట్ చేస్తున్నాయి. అడ్వాన్స్ టిప్ ఆప్షన్ స్థానంలో 'వలంటరీ టిప్స్', 'ఆప్షనల్ టిప్'ను చేరుస్తున్నాయి' అని మంత్రి ఓ ప్రకటనలో తెలిపారు. కంపెనీలు తమ యాప్స్‌ను అప్‌డేట్ చేస్తున్న నేపథ్యంలో వినియోగదారులు ఇకపై ముందస్తుగా డ్రైవర్లకు టిప్‌లు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. ముందస్తు టిప్‌లు ఇవ్వాలంటూ సంస్థలు డ్రైవర్‌లను ఒత్తి చేయకూడదని కూడా తెలిపారు. టిప్ ఇవ్వాలా వద్దా అనేది కస్టమర్ల అభీష్టానికే వదిలేయాలని స్పష్టం చేశారు. కొన్ని యాప్స్‌లో కస్టమర్లు టిప్ ఆప్షన్‌ను స్కిప్ చేసే అవకాశం కూడా ఉందని మంత్రి పేర్కొన్నారు. మరికొన్ని యాప్స్‌లో అడ్వాన్స్ టిప్ ఆప్షన్ కనిపించకుండా మార్పులు జరుగుతున్నాయని అన్నారు. రైడ్ హెయిలింగ్ యాప్స్ తీరుతెన్నులను కేంద్ర మరికొంత కాలం పాటు నిశితంగా పరిశీలిస్తుందని కూడా మంత్రి హెచ్చరించారు. వినియోగదారుల నుంచి డబ్బులు బలవంతంగా వసూలు చేస్తున్నట్టు కనిపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

అమెరికాతో వాణిజ్య చర్చలు జరుగుతున్నాయ్

- కేంద్రమంత్రి పీయూష్ గోయల్
- ఉభయతారకంగా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని కేంద్ర వాణిజ్యశాఖమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఇరుదేశాలకు అనుకూలంగా ఉండే ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఉక్కు, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలోనే ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ఫిబ్రవరిలో ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయినప్పుడు ఈ వాణిజ్య ఒప్పందం విషయమై చర్చలు జరిపారని ఆయన అన్నారు. వాణిజ్యం సుంకాల సమస్యను ఇరుదేశాలు ద్వైపాక్షికంగా చర్చించుకుని పరిష్కరించుకుంటాయని గోయల్ పేర్కొన్నారు. రెండుదేశాల మధ్య ప్రతిపాదిత మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం ఈ వారం భారత్‌కు రానుందని గోయల్ తెలిపారు. జూన్ చివరి నాటికి ఇరుదేశాల మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై ఓ అంగీకారం కుదిరే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై భారత వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ గత నెలలో వాషింగ్టన్‌లో అక్కడి అధికారులతో చర్చలు జరిపారని గోయల్ తెలిపారు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో అధికారిక పర్యటనలో ఉన్న పీయూష్ గోయల్, ఆ దేశంతో వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను పెంపొందించుకోవడానికి అక్కడి నాయకులు, వ్యాపార ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. భారత్ నుంచి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియంపై ఉన్న 25 శాతం సుంకాలను జూన్ 4 నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ఇటీవల డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి విదితమే. ఇదే అమలైతే భారతీయ ఆటో మొబైల్-భాగాల ఉత్పత్తుల ఎగుమతిదారులు, ఉక్కు పరిశ్రమల రంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో భారత్ అప్రమత్తమైంది. అగ్రరాజ్యం రక్షణాత్మక వైఖరిని అవలంబిస్తోందని తప్పుబడుతూ భారత్ ప్రపంచ వ్యాణిజ్యసంస్థను ఆశ్రయించింది.

'ఉపాధి హామీ' వ్యయం 12 శాతం పైకి...

ఈఎఫ్‌సీకి గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదనపై నివేదిక

న్యూఢిల్లీ: సముచిత కేటాయింపులు లేకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోంది. నిధుల్లో కోతలు విధిస్తూ ఈ పథకం లక్ష్యాన్ని దెబ్బతిస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ప్రాధన్యతను ఎప్పటికప్పుడు తగ్గిస్తోంది. ఈ క్రమంలో ఉపాధి హామీ కోసం చేసే వ్యయాన్ని 12 శాతం పెంచుతూ (ఐదేళ్ల కోసం) గ్రామీణాభివృద్ధి శాఖ ఒక ప్రతిపాదన పంపినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. మే 15న వ్యవ ఆర్థిక కమిటీ (ఎక్స్‌పెండిచర్ ఫైనాన్స్ కమిటీ)కి పంపిన ప్రతిపాదనలో ఐదేళ్ల కోసం రూ.5.23 లక్షల కోట్లు అధికంగా పేర్కొన్నట్లు తెలిపింది. ఆర్థిక శాఖ పరిధిలోని ఈ కమిటీ అన్ని ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల వ్యయాలు చూస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం 2020-21 నుంచి 2024-25 వరకు రూ.4.68 లక్షల కోట్లను మాత్రమే మోదీ ప్రభుత్వం ఇస్తున్నది. అయితే 2029-30 నాటికి వ్యయాన్ని 12 శాతం పెంచేదిగా తాజా ప్రతిపాదన ఉంది. 2025 కేంద్ర బడ్జెట్‌లో రూ.86వేల కోట్లను ఈ పథకం కోసం మోదీ ప్రభుత్వం కేటాయించింది. 2024-25 వ్యయానికి సమానంగా ఇచ్చింది. 2024 జులైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ రూ.86,000 కోట్లను ఉపాధి హామీ పథకం కోసం కేంద్రం కేటాయిం చింది. ఆ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఈ పథకం కింద నైపుణ్యత లేని పనికి డిమాండ్ పెరిగింది. ఏప్రిల్‌లో 20.12 మిలియన్ల (2.012 కోట్లు) గ్రామీణ కుటుంబాలు లబ్ధిదారుల్లో ఉండగా, మే నాటికి ఈ సంఖ్య 20.37 మిలియన్ల (2.037 కోట్లు)కు పెరిగింది. కోవిడ్-19 విజృంభించిన మొదటి ఏడాది అంటే 2020-21లో ఉపాధి హామీ పథకానికి రికార్డు స్థాయిలో రూ.1,09,810కోట్లకు ఇచ్చారు. ఎన్నడూ లేని విధంగా 7.77 కోట్ల గ్రామీణ కుటుంబాలు ఈ పథకాన్ని వినియోగించుకున్నాయి. అయితే ఆర్థిక కమిషన్ తదుపరి చర్యల కోసం ప్రభుత్వ పథకాల మూల్యాంకనాన్ని ఆమోదించే కసరత్తులో ఈఎఫ్‌సీ అంచనా, ఆమోదం ఒక భాగమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నట్లు నివేదిక తెలిపింది.

టాప్-20 ఉగ్రవాదులకు పాక్ ఆతిథ్యం

ప్రియాంక చతుర్వేది

న్యూఢిల్లీ: శివసేన యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది పాక్ తీరుపై ఘాటు విమర్శలు చేశారు. అభివృద్ధి బాటలో సాగుతున్న భారత్ జీ-20 సదస్సుకు ఆతిథ్యమిస్తే పొరుగుదేశం పాకిస్థాన్ మాత్రం టీ 20కి అంటే... టాప్ 20 ఉగ్రవాదులకు ఆతిథ్యమిస్తోందని ఎద్దేవా చేశారు. ఉగ్రవాదంతో అంటకాగుతున్న పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు అఖిలపక్ష బృందాలు విదేశాలకు వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం లండన్‌లో పర్యటించింది. ఈసందర్భంగా బృందంలో సభ్యురాలైన ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ... 2001 సెప్టెంబర్ 11న అమెరికాలో జరిగిన ఉగ్రదాడుల వెనక ఉన్న అల్ ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌కు కూడా పాక్ ఆశ్రయం ఇచ్చిందని పేర్కొన్నారు. అతడికి పాకిస్థాన్ ఏవిధంగా ఆశ్రయం కల్పించింది... నిధులు సమకూర్చడం, ఉగ్రవాదులకు శిక్షణనివ్వడం, ఉగ్రచర్యలను ప్రోత్సహించడం వంటి విషయాల గురించి ఓ డాక్యుమెంటరీ కూడా ఉందని... దానిని అందరూ తప్పక చూడాలని వారికి తెలిపారు.

16 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సుక్మా జిల్లాలో సోమవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ప్రభుత్వ లొంగుబాటు విధానం, నాయద్ నెలనార్ పథకంతో ప్రభావితమై ఇద్దరు పీఎల్‌జీఏ మావోయిస్టులతో సహా మొత్తం 16 మంది మావోయిస్టులు బస్తర్ ఎస్పీ కిరణ్ చౌహాన్, ఏఎస్పీ ఉమేష్ గుప్తా, సీఆర్‌పీఎఫ్ అధికారి సుజిత్ పాల్ వర్మ, ఆర్ఎఫ్‌టీ కుంట, (డీఐజీ కార్యాలయం) 218 సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ తిలక్ రామ్, ఇతర ఉన్నతాధికారుల ముందు మావోయిస్టులు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. వీరిపై రూ.25 లక్షల రివార్డు ఉంది. లొంగిపోయిన వారిలో ఒక మహిళా మావోయిస్టు, ఒక పురుష మావోయిస్టుపై ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ముగ్గురు పురుషులకు రూ.2 లక్షల చొప్పున, మరో పురుష మావోయిస్టుపై రూ.3 లక్షలు మొత్తం రూ.25 లక్షల రివార్డు ప్రకటించారు. జిల్లాలో జరిగిన అనేక సంఘటనల్లో వీరు చురుకైన పాత్ర పోషించారు. లొంగిపోయిన మావోయిస్టులు ఇప్పుడు ప్రభుత్వ పునరావాస పథకం కింద సాధారణ జీవితాన్ని గడుపుతారని ఉన్నతాధికారులు తెలిపారు. చత్తీస్‌గఢ్ మావోయిస్టు పునరావాస విధానం-2025 కింద లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు రూ.50 వేల ప్రోత్సాహక మొత్తంతో పాటు ఇతర సౌకర్యాలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన వారిలో రూ.8 లక్షల రివార్డు కలిగిన జోడి సుక్కి (36), రాహుల్ జుమ్మే (18) (పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యుడు), మూడు లక్షల రివార్డు కలిగిన టీం సభ్యుడు లేఖమ్ (28), రెండు లక్షల రివార్డు గలిగిన ఏరియా కమిటీ సభ్యుడు సొంది బుట (20), తెల్లం కోస(19), ఏవోబీ పార్టీ సభ్యురాలు జోడి హుంగ్రి (29), కేరళ పాల్ చేతినామంచి సభ్యుడు మడవి మైక (18), సీఆర్‌జీ మిలిషియా సభ్యుడు రవి బీమా (45), నాగారం సభ్యుడు సొంది దేవ (30) తోకన్పల్లి గ్రామ సంఘం సభ్యుడు హేమల హిడ్మా (40), సొంది హిడ్మా (32), తోకనపల్లి గ్రామ సభ్యులు మడివి సన్న (42), సొంది బీమా (32), పదం దార (31), గొండపల్లి గ్రామ సభ్యుడు జొమినే బెట్టు (23) లేఖమ్ లక్మ (30) లొంగిపోయారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై అధికారులు ఎదుట మావోయిస్టులు లొంగిపోతున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

నా తల్లి ఎక్కడుంది?

'సుప్రీం'లో యువకుడి పిటిషన్

గౌహతి: అస్సాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు. తన తల్లిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, ఆమె ఎక్కడుందో తెలియడం లేదని, ఆమెను కోర్టులో హాజరుపర్చాలని కోరుతూ హెబియస్ కార్పస్ పిటిషన్ వేశాడు. ఈ క్రమంలో ఆ పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. వివరాల్లోకి వెళ్తే... మనోవర బెవా అనే మహిళ బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తిగా పరిగణిస్తూ 2016లో అస్సాం ప్రభుత్వం ఆమెను అదుపులోకి తీసుకుంది. మూడేళ్లపాటు నిర్బంధ శిబిరంలో ఉంచింది. 2019లో ఆమెకు నిర్బంధం నుంచి విముక్తి కలిగింది. నాడు మనోవరకు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. నాటి నుంచి వాటిని పాటిస్తూ అస్సాంలో ఉంటున్న ఆమెను ఇటీవల పోలీసులు మళ్లీ నిర్బంధించారు. అయితే తన తల్లి గురించి ఏ సమాచారం లేదని ఆందోళనకు గురైన ఆమె కుమారుడు తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. నిర్బంధ శిబిరం నుంచి విడుదలయ్యాక సుప్రీంకోర్టు ఇచ్చిన షరతులను పాటిస్తూ తన తల్లి జీవిస్తోందని, కానీ ఇటీవల స్టేట్‌మెంట్ నమోదు చేయాలంటూ తన తల్లిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారని, అక్కడికి వెళ్లిన అమ్మ మళ్లీ తిరిగి రాలేదని పిటిషన్‌లో పేర్కొన్నాడు. అమ్మ కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా ఆమెను కలుసుకోలేకపోయానని, ఆమెకు సంబంధించిన కేసు ఇంకా సుప్రీంకోర్టులో పెండింగ్‌లోనే ఉందని పోలీసులకు చెప్పేందుకు ప్రయత్నించానని, అయినప్పటికీ ఆమెను విడుదల చేసేందుకు వారు నిరాకరించారని ఆ యువకుడు కోర్టుకు తెలియజేశాడు. తన తల్లి ఎక్కడుందో తెలియడం లేదని, తనని కోర్టులో హాజరుపర్చాలని కోరుతున్నానని బాధితుడు పిటిషన్‌లో పేర్కొన్నాడు.

పోలీస్ కార్యాలయానికే కన్నం

రూ.51 లక్షల నగదు, నగలు చోరీ

న్యూఢిల్లీ: పోలీస్ కానిస్టేబుల్ ఏకంగా పోలీస్ కార్యాలయానికి కన్నం వేశాడు. స్పెషల్ సెల్ నుంచి రూ.51 లక్షల నగదు, నగలను చోరీ చేశాడు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు అలెర్ట్ అయ్యారు. ఆ పోలీస్ కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఖుర్షీద్ గతంలో మల్ఖానాలోని పోలీస్ స్పెషల్ సెల్‌లో పని చేశాడు. కొన్ని రోజుల కిందట తూర్పు ఢిల్లీకి అతడు బదిలీ అయ్యాడు. కాగా, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఖుర్షీద్ ఏకంగా పోలీస్ కార్యాలయానికి కన్నం వేశాడు. మే 30న రాత్రి వేళ మలానాలోని పోలీస్ స్పెషల్ సెల్‌కు వచ్చాడు. అందులో ఉన్న రూ.51 లక్షల డబ్బు, బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. మరోవైపు మల్ఖానా ఇన్‌ఛార్జ్ కొద్దిసేపటికే ఈ విషయాన్ని గ్రహించాడు. స్పెషల్ సెల్ నుంచి డబ్బు, నగలు మాయంపై దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఖుర్షీద్‌ను నిందితుడిగా గుర్తించారు. దీంతో స్పెషల్ సెల్ పోలీసులు ఖుర్షీద్‌ను శనివారం అరెస్ట్ చేశారు.

12న ఎంఎఫ్ హుస్సేన్

25 పెయింటింగ్స్ వేలం

ముంబై: ఆధునిక చిత్రకారుడిగా పేరుగాంచిన ఎంఎఫ్ హుస్సేన్ గీసిన 25 అరుదైన చిత్రాలను వేలం వేయనున్నారు. బాంబే హైకోర్టు అంగీకారంతో ఈనెల 12న దక్షిణ ముంబైలోని హామిల్టన్ హైస్‌లో వేలంపాట జరగనుంది. 'ఎంఎఫ్ హుస్సేన్: ఆన్ ఆర్టిస్ట్స్ విజన్ ఆఫ్ ది ట్వెంటియత్ సెంచరీ', పేరిట ఓపీసీఈ-అవర్ ప్లానెట్ కాల్డ్ ఎర్త్ సిరిస్ సహా 25 పెయింటింగ్స్ వేలం వేయనున్నారు. వేలం ముగిసిన అనంతరం జులై 3వ తేదీలోగా నివేదిక ఇవ్వాలని, చిత్రాల అప్పగింతకు తదుపరి ఆదేశాలు తీసుకోవాలని ముంబై షరీఫ్‌ను హైకోర్టు ఆదేశించింది. పారిశ్రామికవేత్త గురు స్వరూప్ శ్రీవాత్సవకు చెందిన స్వరూప్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌కు సంబంధించిన రూ.236 కోట్ల రుణ వివాదం నేపథ్యంలో ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్స్‌ను నాఫెడ్ భద్రపరిచింది. 2006లో స్వరూప్ గ్రూపుపై సీబీఐ దర్యాప్తు చేపట్టింది. హుస్సేన్ పెయింట్స్ సహా రూ.100 కోట్ల ఆస్తులను భద్రపర్చేందుకు నాఫెడ్‌ను ఆదేశిస్తూ ట్రిబ్యునల్ 2008 డిసెంబరులో ఉత్తర్వులు జారీచేసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

మహిళలకు సముచిత స్థానం కల్పించండి

విశాలాంధ్ర -హైదరాబాద్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీతో పాటు ప్రభుత్వంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఆధ్యక్షురాలు సునీతారావు టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ యకుమార్‌గౌడ్‌ను కోరారు. సోమవారం గాంధీ భవన్‌లో తెలంగాణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు అధ్యక్షతన మహేష్ కుమార్ గౌడ్‌తో మహిళ కాంగ్రెస్ కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్‌కు కూడా టీపీసీసీ కమిటీల్లో చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ సీనియర్ మహిళా కార్యకర్తలకి తప్పకుండా చోటు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మహిళ కార్యకర్తల పదవులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. కష్ట పడే వాళ్ళకి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, క్రమ శిక్షణ చర్యలు తప్పితే ఎంతటి వారైనా సరే వేటు తప్పదన్నారు. రాజకీయాల్లో ఓపిక కచ్చితత్వం ఉండాలని, పిపిసీ కమిటీలో అన్ని కులాల వారికి సముచిత స్థానం లభించిందన్నారు.

కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ విచారణ తేదీ మార్పు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాళేశ్వరం కమీషన్ విచారణకు హజరు కావాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విచారణ కమీషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే మొదట ఈనెల 5వ తేదిన అయన కమీషన్ ముందు హజరు కావాల్సిందిగా కమీషన్ అయనకు నోటీసులు జారీ చేసింది. అయితే కేసీఆర్ విజ్ఞప్తి మేరకు విచారణ తేదీని కాళేశ్వరం కమీషన్ మార్చడం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 5వ తేదికి బదులుగా 11వ తేదిన కమీషన్ ముందు హజరు కావాలని కమీషన్ కేసీఆర్‌కు సూచించారు. ఈమేరకు ఈనెల 11 న పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరు కానున్నారు. అదే విధంగా ఇప్పటికే ఈ కేసులో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావుతో పాటు ఎంపీ.ఈటెల రాజేందర్‌లు కూడా విచారణకు హజరు కానున్న విషయం తెలిసిందే.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

జాతీయ జెండా ఆవిష్కరించిన మేయర్ గద్వాల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసుల వందనం స్వీకరించి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్‌లతో కలిసి జాతీయ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు స్నేహ శబరిష్, రఘు ప్రసాద్, వేణుగోపాల్, సుభద్ర దేవి, నళిని పద్మావతి, గీతా రాధిక, యాదగిరిరావు, అశోక్ సామ్రాట్, సిసిపి శ్రీనివాస్, సిఈ సహదేవ్ రత్నాకర్, అడిషనల్ సిసిపిలు వెంకన్న, ప్రదీప్, ఈవిడిఎం అడిషనల్ ఎస్.పి శ్రీనివాస్, ఏ సి పి సుదర్శన్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, మహేష్ కులకర్ణి, సిటిఓ శ్రీనివాస్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఓ.ఎస్ డి అనురాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు, స్వాతంత్ర సమరయోధులకు, తెలంగాణ ఉద్యమకారులకు, కార్పొరేటర్లకు, ఇతర ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడి అసువులు బాసారని, ఈ సందర్భంగా వారందరిని స్మరిస్తూ, నివాళు లర్పించారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనించేలా రాష్ట్ర అభివృద్ధికి, జీహెచ్ఎంసీ అభివృద్ధికి అందరం సమిష్టిగా అంకితభావంతో పని చేద్దామని, నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని మేయర్ కోరారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ శానిటేషన్, వెటర్నరీ, ఎంటమాలజి కార్మికులకు పి.పి.ఈ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీలో చేపట్టిన, చేపడుతున్న హెచ్.సిటీ, ఎస్.ఆర్.డి.పి, ఎస్.ఎన్.డి.పి, డి-సిల్టింగ్, సుందరీకరణ, వాటర్ లాంగిగ్, కమ్యునిటీ డెవలప్మెంట్, స్కిల్ డెవలప్మెంట్, పి.ఎం స్వానిధి, ఫుడ్ సేఫ్టీ, అర్బన్ బయోడైవర్సిటీ తదితర కార్యక్రమాలపై క్లుప్తంగా వివరించారు.

ఆర్థిక దోపిడికి మావోయిస్టులను అంతం చేస్తున్న కేంద్రం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సహజ వనరులు, అటవీ సంపద, ఆర్థిక దోపిడి కోసమే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతం చేసే పంతం పట్టారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యం.బాల నరసింహ అన్నారు. సోమ వారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మహబూబ్ నగర్ జిల్లా సమితి సమావేశం భాగి కృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశా నికి ముఖ్య అతిథులుగా హాజరైన యం. బాల నరసింహం మాట్లాడుతూ మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్‌తో బూటకపు ఎన్కౌంటర్లు జరుపుతున్నారని కనీసం వారి మృత దేహాలను కూడా అప్పగించకుండా పైశాచికానం దం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులను తయారు చేసే ఫ్యాక్టరీగా ఉన్న పాకిస్తాన్తో శాంతి చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సంబంధించిన డిమాండ్స్‌తో సిద్ధాంతపరంగా ఉన్న మావోయిస్టులతో శాంతి చర్చలకు ముందుకు రాకపోవడం గమనార్హం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మిత్ర దేశంగా భావిస్తున్న అమెరికా పాలకవర్గం నేడు భారతదేశా నికి యాజమాన్య దేశంగా రూపాంతరం చెందిం దని వాపోయారు. గతంలో జరిగిన పాకిస్తాన్ ఇండియా యుద్ధ కాలంలో ఇందిరాగాంధీ అమెరికా ప్రభుత్వం అనుసరించిన పెత్తన ద్వంద నీతిని వ్యతిరేకిస్తూ బహిరంగంగా మీడియా సమావేశాన్ని బహిష్కరించిందని గుర్తు చేశారు. కానీ నేడు మోడీ ప్రభుత్వం సామ్రాజ్య వాద అమెరికాకు మోకరిల్లడం యావత్ భారతదేశ ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఉందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని గ్యారెంటీలను అమలు చేయాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి రాజీవ్ యువకిరణాలు పథకం ద్వారా ఆర్థిక చేయుత అందించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి బి. పరమేశ్వర్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, ఆర్.అల్వాల్ రెడ్డి, భాగీ కృష్ణ యాదవ్, కౌన్సిల్ సభ్యులు చాంద్ పాషా, శంకర్ నాయక్, శ్రీను, జి.సత్యనారాయణ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, భార్గవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలకు చేరేలా కృషి చేస్తున్న సిబ్బందికి అభినందనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా బాగా పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సోమవారం జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించు కొని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పోలీస్ గౌరవ వందవాన్ని స్వీకరించి, తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించి, జాతీయ పథకావిష్కరణ గావించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేలా మానవత దృక్పథంతో పనిచేస్తున్న జిల్లా అధికారులు, ఉద్యోగులు అభినందనీయులని ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో బాగా పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని, డాక్టర్ జి ముకుందరెడ్డి, డిఆర్ఓ ఈ.వెంకటాచారి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు, తహసిల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టర్‌ను కలిసిన టీజీవో నేతలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా టీజివో ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ అనుదీప్ దురిశెట్టిను మర్యాదపూర్వకంగా కలసి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా గౌరవనీయ జిల్లా కలెక్టర్ గారు కూడా తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో టీజీవో అసోసియేషన్ సభ్యులు మరియు ఉద్యోగుల సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్, కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, అసోసియేట్ అధ్యక్షులు అశన్న, ఉపాధ్యక్షులు సురేందర్ గతదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలిలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన జలమండలి అధికారులు, ఉద్యోగులు, వినియోగదారులకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఆపరేషన్స్ డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్ కుమార్, అమరేందర్ రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్లు సుదర్శన్ శ్రీధర్, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎంలు, జీఎంలు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ జలమండలి డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లోనూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జలమండలి అధికారులు, ఉద్యోగులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భవన్‌లో..

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎన్‌టిఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకను తెలుగుదేశం పార్టీ సోమవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. తదనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. రాష్ట్ర పార్టీ నాయకులు, షేక్ ఆరిఫ్, డాక్టర్ ఏ.ఎస్. రావు, పోలంపల్లి అశోక్, కందికంటి అశోక్ కుమార్ గౌడ్, జాతీయ పార్టీ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, రాష్ట్ర నాయకులు అజ్మీరా రాజునాయక్, గోపాల్ రెడ్డి, నెల్లూరి దుర్గాప్రసాద్, శ్రీనివాసా నాయుడు, శ్రీపతి సతీష్ కుమార్, మీడియా కమిటీ చైర్మన్ ప్రకాశ్ రెడ్డి, పొగాకు జయరామ్ చందర్, సంధ్యపోగు రాజశేఖర్, వేజెండ్ల కిశోర్‌బాబు, నాగు నగేష్, జనగామ నర్సింగ్‌రావు, శ్రీశ్కైలం మహానంది, నాయుడు కోటేశ్వర్‌రావు, గూడెపు రాఘవులు, తమోదన్ రావు, రత్నాకర్‌రావు, జోగేందర్ సింగ్, స్వాతి, జయశ్రీ, లలిత, శివకుమార్, జోగేంద్రసింగ్, నర్సింహ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఏ) కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ కె. జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివేళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారతదేశంలో భాషా రాష్ట్రాల ఏర్పాటు చారిత్రక సందర్భాన్ని వివరించారు. కార్యదర్శి, ప్రణాళిక డైరెక్టర్లు, హెచ్.జి.సి.ఎల్. సి.జి.ఎం, అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ ఓ.ఎస్.డి., ఇతర విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రా : తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని, ప్రాజెక్టుల పేరుతో ఆస్తులను కూడబెట్టిన బడా నేతల ఆస్తులను జాతీయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్.బోస్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవం సందర్భంగా సీపీఐ ఉప్పల్‌మండల సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను బోస్ ఎగురవేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్.బోస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12సంవత్సరాలు అయిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం ఎన్నో పోరాటాలు, ఎంతో మంది త్యాగాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, కె. ధర్మేంద్ర, జిల్లా సమితి సభ్యులు నారా నర్సింహా, ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు లక్ష్మీ నారాయణ, నర్సింహా రావు, సత్యనారాయణ, కృపాకర్, నర్సింగ్‌రావు, మిరియాల సాయిలు, రజనీ, శోభ, శ్రీనివాస్, సాయిలు, ప్రతాప్, సుదర్శన్, అక్షర్ రెడ్డి, ఎండి.అజీమ్ పాషా, మహేష్ పాల్గొన్నారు.

మెట్రో రైల్ భవన్‌లో ...

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వి.ఎస్. రెడ్డి రసూల్‌పురా మెట్రో రైల్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ, వారి కృషికి ఆయన నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అద్భుతమైన పురోగతి సాధిస్తోందని, దేశంలో అనేక రంగాలలో నంబర్ వన్‌గా నిలిచిందని ఎం.వి.ఎస్.రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైల్ ఫేజ్-2(ఎ) కి సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఫేజ్- 2(బి)కి సంబంధించి డీపీఆర్ ను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపనున్నదని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రైల్ సీనియర్ అధికారులతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్.బి.నగర్‌లో...

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : తెలంగాణ రాష్ట్ర,11వ అవతరణ దినోత్సవం సందర్భంగా న్యూ నాగోల్‌లోని సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం డాంగే భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షుడు దండు నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొడ్డుపల్లి కృష్ణ (సిపిఐ రాష్ట్ర సబ్ కమిటీ మెంబర్) జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ కోసం అమరవీరులైన కుటుంబాలకు నేటికీ న్యాయం జరగలేదని, సకల జనులు ఉద్యమిస్తే వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో నేటికీ సకల జనులకు న్యాయం జరగటం లేదని అన్నారు. అణగారిన వర్గాలు అనేక ఆశలు పెట్టుకుని జీవిస్తున్న వారి ఆశలు అడియాసలే చేస్తున్న పాలకవర్గాలను నిలదీయడానికి మరో సామాజిక తెలంగాణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉడుతల మల్లేష్, ఆర్.యాదగిరి, సంగు సైదారావు, ఎండి పాషా మియా, జి.అంజి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హనుమకొండ : పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం కరువైందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వరంగల్ కొత్తవాడలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తూ రాష్ట్ర సాధన కోసం తొలి దశ, మలిదశ ఉద్యమాలలో వందలాది యువకిశోరాలు ప్రాణాలర్పించారని వారి త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. స్వ రాష్ట్రంలో ప్రజలందరి సమస్యలు పరిష్కారం అవుతాయని సామాజిక న్యాయం లభిస్తుందని ఆశిస్తే నిరాశే మిగిలింది అన్నారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో సామాజికన్యాయం నేటికీ అందని ద్రాక్షగానే మిగిలింది అన్నారు. సామల రవి, ఎండి అక్బర్, లింగ బత్తిని శంకర్, తాటిపాముల నరసయ్య, ఆడెపు దేవేందర్, రాజేంద్ర చారి, జహంగీర్, హఫీజ్, సుమన్, రమాదేవి, పుణ్యవతి, రమ, రజిత, రాధ, జ్యోతి, ప్రమీల, సంధ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ డా. పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, డిసిపి కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలతో కలిసి చీఫ్ విప్ డా.పట్నం మహేందర్‌రెడ్డి పోలీసు గౌవర వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ జిల్లా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను వివరించారు. జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లును మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా గూడులేని పేదలకు నీడకల్పించి వారి భవిష్యత్తుకు భరోసాకల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులకు భూ భారతి చట్టం పై అవగహన కల్పించుటకు 3వ తేది నుండి 20 వ తేది వరకు జిల్లాలో అన్ని గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన 4 గురి కుటుంబ సభ్యులను శాలువా, పండ్ల బోకేతో సన్మానించారు. అంతకుముందు కీసర చౌరస్తాలోని తెలంగాణ అమరవీరులు స్మారక చిహ్నాము వద్ద పూల మాలలు వేసి, చీఫ్ విప్, ఎమ్మెల్సీ డా.పట్నం మహేందర్ రెడ్డి, కలెక్టర్ గౌతమ్‌పోట్రు, డిసిపి కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డిలు అమరవీరులకు నివాళులు అర్పించారు. డిఆర్ఓ హరిప్రియ, కిసర ఆర్డీఓ, ఉపేందర్ రెడ్డి, ఇంచార్జీ మైనార్టీ అధికారి జి.కాంతమ్మ, కలెక్టరేట్ ఎఓ ఎల్. రామోహన్, వ్యవసాయ శాఖ ఎడిఎ చంద్రకళ, డిఇఓ ఐ.జయకుమారి, యువజన సర్వీసుల శాఖ అధికారి గోపాల్, సివిల్ సప్లై శాఖ డియం.సుగుణబాయి, డియస్ఓ శ్రీనివాసరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో..

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఉద్యోగుల సంఘం తెలంగాణ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీజీపీసీబీ ప్రధాన కార్యాలయం సనత్‌నగర్‌లో సభ్య కార్యదర్శి జి.రవి జాతీయ జెండాను ఎగురవేసి సిబ్బందికి, అధికారులకు శు భాకాంక్షలు తెలియజేసారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది యువకులు చేసిన పోరాటంలో త్యాగం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఎనలేని ప్రాముఖ్యత ఉందని అన్నారు. పిసిబిలో ప్రత్యేకంగా కొలువు దీరిన అమ్మవారు మండపంలో ఉద్యోగులు, సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలను నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర 12వ అవతరణ దినోత్సవం సందర్భంగా సీపీఐ మల్కాజిగిరి మండల సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు అధ్యక్షతన వినాయక్ నగర్ సిపిఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మండల కార్యదర్శి టి యాదయ్య గౌడ్ ఆవిష్కరించి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12సంవత్సరాలు అయిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం ఎన్నో పోరాటాలు, ఎంతో మంది త్యాగాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు కొంగ ప్రభాకర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు జే.వెంకటరమణ, ఎస్.కె .అజీజ్, సయ్యద్ యూసఫ్ బి, నరేందర్, యాదగిరి, వెంకటేష్, మహిళ నాయకురాలు కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో అనేక మంది బలిదానాలను చూసి సోనియా గాంధీ చాలించి తెలంగాణాలో యువత మృతి చెందారాదని భావించి ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిందని, దీని బిఆర్ఎస్ పార్టీ నాయకులు వారే తెలంగాణ తెచ్చినట్లు చెప్పుకోవడం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తేనే తెలంగాణ వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, వెంకటేష్ యాదవ్, కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులు ఎస్.ఆర్.ప్రసాద్, చంద్ర శేఖర్, పిట్టల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజిగిరి చౌరస్తాలో జాతీయ జెండాను ఎగురవేశారు. బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి సర్కిల్ బిఆర్ఎస్ నాయకులు జెఎసి వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ర సాధనలో హింస లేకుండా తెలంగాణ సాధించిన ఘనత బిఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. నంతరం మల్కాజిగిరి గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని అయన ప్రారంభించారు. కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరుశు రాం రెడ్డి, రావుల అంజయ్య, జీకే హనుమంతరావు, చిన్న యాదవ్, బాబురావు, కాటమరాజు, ఉపేందర్, సతీష్, నర్సింగరావు, శివకుమార్, హేమంత్ పటేల్, గోపాల్, ఉస్మాన్, భాగ్యనంద్, దినేష్, సంతోష్, మారుతి ప్రసాద్, హేమంత్ రెడ్డి, బాలకృష్ణ, ఫరీద్, అరుణ్ రావు, పేపర్ శీను, గోపాల్, శేఖర్ గౌడ్, కృష్ణమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ యాదవ్, సుమన్ గౌడ్, సాయి గౌడ్, వంశీ ముదిరాజ్, రాజశేఖర్ రెడ్డి, వినీత్ సందీప్ నిఖిల్ రెడ్డి, జనార్ధన్, మురళి, అధిక సంఖ్యలో యువకులు మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎర్రబోడ చౌరస్తాలో జాతీయ పతాకం ఎగరవేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ హాజరుయ్యారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ చిన్నమ్మ సుష్మ స్వరాజ్ ఆరోజు పార్లమెంటులో బిల్లు పాస్ చేయడం వల్లనే ఎంతో మంది అమరు వీరుల త్యాగం వల్లనే తెలంగాణ కళా సహకారమైందని చెప్పడం జరిగింది. సత్యనారాయణ ముదిరాజ్, కోరని సదానంద్ సోల్కర్ రెడ్డి, వాసు, వనిత రెడ్డి, మల్లేష్ చారి, వెంకటేష్,పద్మావతి, కవిత, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, ప్రకాష్ నాయక్, సిద్దేశ్వర్, విజయ్ యాదవ్, అల్లి శివకుమార్, గోపాల్, రమకాంత్, గణేష్,జయ ప్రకాష్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, లడ్డు, సాయి, చంద్ర గౌడ్, శశిధర్, వెంకట్ రెడ్డి, జీవన్ తదితరులు పాల్గొన్నారు

సీఎస్‌కే విల్లాస్ నూతన అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - షాద్‌నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని సీఎస్కే విల్లాస్ నూతన కార్యవర్గం కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రమాణ స్వీకార మహెూత్సవ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి పాల్గొని నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ అధ్యక్షునిగా అప్పిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జెనరల్ సెక్రటరీగా సోమశేఖర్, కోశాధికారిగా సాధత్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి స్థానిక మాజీ కౌన్సెలర్ శ్రావణి, యూసుఫ్ భామస్, అబ్దుల్ రబ్ జామి, జమ్రుత్ ఖాన్, ముంతాజ్ బేగం, శివరాం, హీరా గ్రూప్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్ రెడ్డి కోరారు. ఒకే మార్పు అభివృద్ధికి మలుపు అనే నినాదంతో తుర్కయంజాల్‌లో ర్యాలీ నిర్వహించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటి సుందరీకరించేందుకు, ప్రజలందరూ సహకరించాలని సూచించారు.సోమవారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మున్సిపల్ ఆఫీసులో వంద రోజుల కార్యాచరణ, ప్రణాళిక బ్రోచర్ కార్యక్రమాన్ని కమిషనర్ చేతుల మీదుగా ప్రారంభించారు. తుర్కయంజాల్ అంబేద్కర్ చౌరస్తా నుంచి మాసబ్ చెరువు వరకు మున్సిపల్ సిబ్బందితో కలిసి భారీగా ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయపతాక ఆవిష్కరణ

ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డికి పోలీసులు గౌరవ వందనంతో జిల్లా యంత్రాంగం తరపున ఘన స్వాగతం పలికారు. అనంతరం గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రజలనుద్దేశించి గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర అభివృద్దే అమరులకు అసలైన నివాళి అని అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆప్యాయంగా పలుకరిస్తూ, అమరవీరుల కుటుంబాలను సత్కరించారు. జిల్లా జీవన జ్యోతి మహిళ సమాఖ్యకు 80 కోట్ల 02 లక్షల, 89 వేల చెక్కును, మెప్మా ద్వారా జిల్లాలోని 385 మహిళా సంఘాలకు 50 కోట్ల రుణాల పంపిణీ చెక్కును గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు అందజేశారు. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పాఠశాలల నుండి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులకు మెమెంటోలు గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు(ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి అందజేశారు. తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు(ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు అంతకుముందు కలెక్టరేట్ ఆవరణలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ఆర్డీఓ సంగీత తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల త్యాగాల పునాదులపై, పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అన్ని

భూభారతి రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద భూ సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించేందుకు వీలుగా జూన్ 03 నుండి అన్ని మండలాలలో గ్రామాల వారీగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. సోమవారం ఆర్డీఓలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లకు రెవెన్యూ సదస్సుల నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పైలెట్ ప్రాతిపాదికన జిల్లాలోని కొందుర్గు మండలంలో గల గ్రామాలలో రెవెన్యూ సదస్సులను జరిపి, క్షేత్రస్థాయి విచారణ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అదే తరహాలో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్‌ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించాలని అన్నారు. జూన్ 03 నుండి 23వ తేదీ లోపు రెవెన్యూ సదస్సులను విజయవంతంగా పూర్తి చేయాలని గడువు విధించారు. ప్రతిరోజూ ఉదయం 9.00 గంటలకు సదస్సులు ప్రారంభం కావాలని, సాయంత్రం వరకు అందుబాటులో ఉంటూ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ రెవెన్యూ బృందాలు సకాలంలో గ్రామాలకు చేరుకోవాలని, సదస్సుల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఒకటి, రెండు రోజుల ముందే ఆ ప్రాంత రైతులు, ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే చోట తాగునీరు, సరిపడా కుర్చీలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్ ఏర్పాటు చేయాలని, దరఖాస్తుదారులకు సహకరించేలా హెల్ప్ డెస్క్ ను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా దరఖాస్తులు దాఖలు చేసేలా చూడాలని, రిజిస్టర్లలో సమగ్ర వివరాలను నమోదు చేస్తూ, పూర్తి డాటాను కంప్యూటర్ ఆన్లైన్ లోనూ పొందుపర్చాలని ఆదేశించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, మొక్కుబడిగా కాకుండా ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూభారతిలోని నిబంధనలపై పరిపూర్ణమైన అవగాహనను కలిగి ఉన్నప్పుడే, తప్పిదాలకు తావులేకుండా దరఖాస్తుల పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించగల్గుతారని తెలిపారు. ముందుగా డెస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులోని వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలని, అనంతరం క్షేత్రస్థాయికి

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో సీట్లకు దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బెస్ట్ అవైలబుల్ స్కూల్లో ఖాళీ ఉన్న సీట్లలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ అధికారి డాక్టర్ కె.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో 159 సీట్లు (నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల యందు ఒకటవ తరగతి యందు ప్రవేశం కొరకు 5 నుండి 6 సంవత్సరాల లోపు గల షెడ్యూల్డ్ కులాల బాల బాలికల నుండి దరఖాస్తులు కోరబడుచున్నావని అయన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హైదరాబాద్ వాస్తవ్యులై ఉండాలని, అలాగే నేటివిటీ సర్టిఫికెట్ మీ సేవ ద్వారా పొంది ఉండాలని తెలిపారు. అభ్యర్థి తల్లి దండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000 లోపు అలాగే రూ.2,00,000 లోపు పట్టన ప్రాంతాల వారికి ఉండాలని పేర్కొన్నారు. ఒక్క కుటుంబం నుండి ఒక్క విద్యార్థి మాత్రమే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద అవకాశం కలిపించబడునని అలాగే విద్యార్థి వయస్సు (1.06.2019 నుంచి 31.05.2020 మధ్య జన్మించి ఉండాలని 31.05.2025 నాటికి 5 నుండి 6 సంవత్సరాలు కలిగి ఉండాలన్నారు. బాల బాలికలు పాఠశాలల యందు ప్రవేశానికి దరఖాస్తు ఫారాలు జూన్ 2 నుండి 16 వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం 8వ అంతస్తు నాంపల్లి చంద్రవిహార్ కాంప్లెక్స్, హైదరాబాద్ జిల్లా యందు లభించునని ఉపసంచాలకులు డాక్టర్ కటకం రమేష్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయానికి నేరుగా 16న సాయంత్రం గం.5.00 లోపు అందవలెను. ఆ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవు. 20న విద్యార్థుల ఎంపిక కై డ్రా పద్ధతిలో విద్యార్థుల ఎంపిక చేయబడుతుందని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర - మొయినాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌండ్ల నిరంజన్ గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని నక్కలపల్లి గ్రామంలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎవరూ చెప్పినా తమ అభిప్రాయాలను కాకుండా నిజమైన నిరుపేద అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయడమే లక్ష్యమన్నారు. ఎవరైనా అర్హులు లబ్దిదారుల జాబితాలో లేకున్నా వారిని గుర్తించి వెంటనే ఇళ్లు మంజూరు చేయించడం జరుగుతుందని చెప్పారు. పేదోడి సొంతింటి కలలు సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నక్కలపల్లిలో అర్హులైన పంచాయతీ కార్యదర్శి యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ లీడర్లు మల్లారెడ్డి, సబీర్, కృష్ణమయ్య, మల్లేష్, ఖలీల్, చాకలి అంజి, సమీర్, మల్లేష్, యాదయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అమనగల్లు: యువత స్వయం ఉపాధితో ఎదగాలని స్థానిక శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్ నూతన ఎస్‌వీఎస్ డిజిటల్ ఫోటో స్టూడియోని టీపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నర్సింహ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంబించి, వస్పుల శ్రీకాంత్ నీ అభినందించి, ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ యువత ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని స్వశక్తితో వాటిని సాధించేలా కష్టపడాలన్నారు. యువత స్వయం ఉపాధితో ఎదిగి నలుగురికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని, యువత చేతుల్లోనే సమాజం ఉందని, వారు తలుచుకుంటే ఏదైనా సాధిస్తారని అన్నారు. బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, మండల అధ్యక్షులు జగన్, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ డైరక్టర్ వస్పుల శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు వస్పుల మానయ్య, కాంగ్రెస్ ముఖ్య నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యువజన సంఘం ఉపధ్యక్షుడు శాబుద్దీన్, మీడియా కన్వీనర్ కొప్పు విజేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కిన కేసీఆర్

విశాలాంధ్ర- బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రం సిద్దించిన తరువాత పదేళ్లు ఫామ్ హౌస్ లో పడుకొని కెసిఆర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కాడని, నేడు అధికారంలోఉన్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఖజానా ఖాళీ పేరుతో అదే బాటలో నడుస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిద్ది సుధాకర్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నీళ్లు, నిధులు, నియామకాలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకున్నా 10 ఏళ్ళు గారడీ మాటలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే చేస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడుతూ తెలంగాణ ఏ ఒక్కరి వల్లో రాలేదని, ఎందరో ప్రాణ త్యాగాలతో వచ్చిందని, రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్ళు పూర్తి కావస్తున్నా ప్రజల ఆకాంక్షలు నెరవేరకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు విజయ్ మల్లంగి, అజీమ్ బైగ్, డా. లక్ష్మ నాయుడు, షాబాజ్, సుధరాణి, రాకేష్ రెడ్డి, లియాఖత్ ఖాన్, రాకేష్ సింగ్, భాస్కర్, ఆహసాన్. ఎస్వెన్. రెడ్డి, రమ్య గౌడ్, రాకేష్, పవర్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రెసిడెంట్ ఉప్పర మీన్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 130 సుభాష్ నగర్ డివిజన్ పరిధి పాండు బస్తీలో నూతన కాలనీ ఓనర్స్ అసోసియేషన్ కమిటీ ఏర్పాటు చేశారు. అనంతరం ప్రెసిడెంట్‌గా ఉప్పర మీన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, సతీష్ కుమార్, జనరల్ సెక్రెటరీ వరలక్ష్మి, సుకన్య, విష్ణు, మహేష్, గుంజ హరి, సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ షాకిర్, జాయింట్ సెక్రెటరీ సుధాకర్ ముదిరాజ్, నాగరాజు, నరేంద్ర, శ్రీనివాస్, బత్తుల శంకర్, ట్రెజరర్లు చంద్ర రెడ్డి, చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు చంద్రమౌళి, బీహార్ సురేష్, రాము, శ్రీనివాస్, మొంటు, కొండల్, ప్రధాన సలహాదారునిగా అంతటి పాండు గౌడ్, సలహాదారులుగా మంజునాథ్, విజయకుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మీన్ కుమార్ మాట్లాడుతూ ఈ కమిటీ ఏర్పాటుకు బస్తీ ఓనర్స్ అందరూ ఎంతో వారి సహకరించినందుకు, బస్తీ అభివృద్ధి పనులలో ప్రతి ఒక్కరి సహకారం ఉండాలన్నారు. నూతనంగా ఏర్పడినటువంటి ఈ కమిటీని గుంజా తిరుపతి, తలారి ప్రభాకర్ నాయుడు కమిటీని వెన్నంటే ఉండి నడిపిస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆరు దశాబ్దాల నిరీక్షణకు కాంగ్రెస్ పార్టీ తెరదించిందని టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. ఇందిరమ్మ ఆశయాలకు నేటి తెలంగాణ రాష్ట్రంలో న్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో అయన జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. అంతకుముందు అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళ్లు అర్పించారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను ఆయన గుర్తుచేసుకుంటూ, వారి ఆదర్శాలు యువతకు ప్రేరణగా నిలవాలని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల ఆర్థిక విధ్వంసాన్ని అధిగమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం బాటలో తెలంగాణ ముందుకు సాగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల సిద్ధాంతంతో పాలన సాగుతోందని చెప్పారు. సామాజిక న్యాయం అనేది కాంగ్రెస్ సంకల్పమని అందులో భాగంగానే శాస్త్రీయ కులగణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణతో దేశానికే మార్గదర్శకంగా నిలిచామన్నారు. దేశవ్యాప్తంగా కుల సర్వే జరగాలన్న రాహుల్ గాంధీ ఆకాంక్ష త్వరలో నేరవుతుందన్నారు. రూ.500 గ్యాస్ సబ్సిడీ వల్ల 40 లక్షల కుటుంబాలకు ఉపశమనం కలిగిందన్నారు. అదేవిధంగా రైతుల సంక్షేమం కోసం రూ. 21,000 కోట్ల రుణమాఫీ తో 25 లక్షల రైతులను రుణవిముక్తులను చేశామని, రూ.500 వరి బోనస్‌తో సన్న బియ్యం ఉత్పత్తి పెరిగిందన్నారు. 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య దిగుబడితో దేశంలో ప్రథమ స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు. కంచె చేను మేసినట్లు గతంలో ప్రభుత్వ అస్తులను మొత్తం నాశనం చేశారన్నారు. "కాళేశ్వరం కాస్త కులేశ్వరం అయిందని, హరీష్ రావుకు బీఫాం వస్తుందా, "నాలుగు ముక్కలాట"లో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తావ్ హరీష్ అంటూ ఎద్దేవ చేశారు.

విశాలాంధ్ర - అమనగల్లు: ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాల స్పూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు కంబాల పరమేష్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు చేశారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేష్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. మండల కేంద్ర కూడలిలో మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం స్వరాష్ట్ర సాధనలో ఎందరో అమరవీరుల తమ ప్రాణాలను లెక్క చేయక ఉద్యమానికి ఊపిరిపోసి తెలంగాణ సాధనలో కీలక భూమిక పోషించారని అన్నారు. మలిదశ ఉద్యమంలో కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ ఏర్పాటు అని తెలిపారు అనంతరం వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్నయ్య, ఎంపీటీసీలు లచ్చిరాం నాయక్, గోపాల్, ప్రియా రమేష్, మంజులా చంద్రమౌళి, పంత్యా నాయక్, మాజీ సర్పంచులు రవీందర్ రెడ్డి, సులోచనా సాయిలు, బాగ్యమ్మ జంగయ్య, నక్కపోతు యాదయ్య, రైతు కో ఆర్డినేటర్ జోగు వీరయ్య, మంగలపల్లి నర్సింహ్మా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్, రామచంద్రయ్య, మహేష్, రమేష్, రవి, కృష్ణ, జంగయ్య, వెంకటేష్, సురేష్, వివిధ గ్రామపార్టీ బీఆర్ఎస్ అధ్యక్షులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బుద్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జాతీయ జెండా ఎగరావేశారు ఈ సందర్భంగా తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన తెలంగాణ అమరవీరులు చేసిన త్యాగలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో బౌరంపేట్ నందు సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిజెపి మున్సిపల్ అధ్యక్షులు పిసరి కృష్ణ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పించి ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ మాజీ సర్పంచ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు నల్ల రామచంద్రరెడ్డి, సీనియర్ నాయకులు, ప్రభాకర్ రెడ్డి, నర్సింహాచారి, సీతారాంరెడ్డి, జంగారెడ్డి, మాధవరెడ్డి, ఆకుల సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, రాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని శ్రీ మంకీస్ సర్కిల్ దగ్గర సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం వీర అమరలను గుర్తు చేస్తూ వారికి నివాళులు అర్పించి, తెలంగాణను ఇచ్చిన సోనియమ్మ, కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షైక్ రఫీయా బేగం, ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, కుమార్ యాదవ్, శ్రీశైలం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్, నారాయణరెడ్డి, ఏలూరి సత్య, లింగాల గంగాధర్, వరగాని వాసు, విజయ్‌కుమార్, మధుసూదన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, పంగా శ్రీనివాసరావు, మల్లికార్జున్, బికన్ షా, ప్రేమ్ కుమార్, గూడూరు మురళీ, గోలి శ్రీను, తులసీదాస్, రఫత్,ఆదిరెడ్డి, సురేంద్ర యాదవ్, వినోద్, రవీంద్ర, మహమూద్, ప్రభాకర్ రెడ్డి, రాంచందర్ నాయక్, నరసింహారెడ్డి, సాయిరాజ్, విష్ణు, పితాని శ్రీనివాసరావు, బాలకృష్ణ, లక్ష్మణ్, హరిబాబు, రఘు, ఎం శ్రీనివాస్, మహిపాల్, రామానాయుడు, కృష్ణ, శ్రీదేవి, సరితారెడ్డి, ధనలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడిపల్లి మండలంలోని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ భగత్ సింగ్ కాలనీలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దండు రమేష్, మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎందరో మహనీయులు త్యాగం చేసినారు మలిదశ తెలంగాణ ఉద్యమంలో సుమారు 1200 మంది ఆత్మ బలిదానం చేసుకొని తెలంగాణ సాధించినారు. సాధించిన తెలంగాణ లో గత పది సంవత్సరాల నుండి దొరలు, రెడ్డిల పరిపాలన జరుగుతుంది. ఆనాటి తెలంగాణ ఉద్యమం నుండి మలిదశ ఉద్యమం వరకు దళిత బహుజనులే ఆత్మ బలిదానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దండు రమేష్ (ఎ.ఐ.టి.యు.సి) జిల్ల డిప్యూటీ సెక్రటరీ ఈ కార్యక్రమానికి అధ్యక్ష వహించిన మహిళా సమైక్య మండల కార్యదర్శి కే.మాలవి, జెండా ఆవిష్కరించినారు. సీనియర్ నాయకులు ఇస్తారి, (ఏ.వై.ఎఫ్) మండల కార్యదర్శి నాగరాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ప్రమీల, (బి.కే.ఎం.యు) నాయకురాలు మహాలక్ష్మి, బీసీ సంఘం నాయకులు బాబు, రాజు, సిపిఐ పార్టీ నాయకులు భూతం ఐలయ్య, రమ కృష్ణ మైపాల్, ఉపేందర్, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం ఉదయం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకార్యాలయంలో జాతీయ జెండాను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ జెండాను ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. అదేవిధంగా తెలంగాణ అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది,నాయకులుతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్, నిర్మల, ప్రభు, సతీష్, శంకర్ గౌడ్, కిరణ్, సావిత్రి, సరస్వతి, వాణి, కళ్యాణి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తూర్కయంజాల్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకలు తూర్కయంజాల్ మున్సిపాలిటీ పరుధిలో ఘనముగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది సమక్షంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించటం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 100 రోజుల కార్యక్రమంకి సంబంధించి తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలో, తుర్కయంజాల్ ఎక్స్ రోడ్డు నుండి మసాబ్ చెరువు బుద్ధ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రతిజ్ఞ చేయటం జరిగింది. ఈ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో పారిశుద్యం, మంచినీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ, శానిటేషన్ సిబ్బందికి హెల్త్ క్యాంప్ లు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించటం, ప్లాస్టిక్ నియంత్రణ,రెవెన్యూ రాబడి పెంచుకోవటం, వీధి కుక్కల నియంత్రణ, వనమహెూత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అమరెందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ డిఈ, ఏఈఈ, ఆర్ఓ, ఎస్ఐ, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ అవతరణ దినోత్సవ సందర్భంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపం వద్ద టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కెఆర్ రాజ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.భాస్కర్‌లు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ట్రెజరర్ ప్రేమ్, ఇసి ప్రియ, మోయిన్ టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం వైస్ ప్రెసిడెంట్ ముజ్జాయిద్, జాయింట్ సెక్రటరీలు, సుదర్శన్, శ్రీనివాస్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ, పబ్లిసిటీ సెక్రటరీ ఫిరోజ్, అరుణ జ్యోతి, ఇసి యోగి, రాజేందర్, చంద్రశేఖర్ రెడ్డి, సీపీరెడ్డి, ఖాజాషోయిల్ అహ్మద, ఫయాజ్, శ్రీకాంత్, రమాకాంత్, మధుకర్, వెంకటేష్, లావణ్య, దేవిప్రసాద్, మీర్జా, నుస్రత్, విజయకుమార్, అనిల్, గౌసియా, లక్ష్మీపతి, నూరుద్దీన్, ఎజాజ్, తయార్, పృథ్వీ, ప్రవీణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, కుశాల్, పరమేష్, కులకారిణి, దామోదర్, సాయి, రోషన్, మధు, సీతారాం, ఐజాజ్, రవి, పవన్, రవికాంత్, రోషన్ పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

హామీల అమలు కోసం పోరు

పేదలకు ఇంటి స్థలాలు, సూపర్ సిక్స్ ఎన్నికల హామీల కోసం సీపీఐ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. పేద ప్రజలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలివ్వాలని, గృహ నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలు కేటాయించాలని, సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని నినాదాలు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లు, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు.

గుంటూరులో

తిరుపతిలో

ఒంగోలులో

విజయవాడ రూరల్‌లో

కర్నూలు జిల్లాలో

విజయవాడలో

మచిలీపట్నంలో

రాజమండ్రిలో

దొంగ సర్టిఫికెట్లు జారీ చేస్తే క్రిమినల్ కేసులు

అర్హత కలిగిన క్రీడాకారులకే ఉద్యోగావకాశాలు

శాప్ చైర్మన్ రవినాయుడు

విశాలాంధ్ర- విజయవాడ స్పోర్ట్స్: మెగా డీఎస్సీలో భాగంగా స్పోర్ట్స్ కోటా కింద రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనున్న 421 పోస్టులకు సంబంధించి దొంగ సర్టిఫికెట్లు జతపరిచే అభ్యర్థులకు, వాటిని జారీ చేసే క్రీడా సంఘాల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు తప్పవని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు హెచ్చరించారు. స్థానిక శాప్ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో శాప్ పరిపాలనా అధికారులు, వివిధ విభాగాల బాధ్యులతో సోమవారం ఆయన సమీక్షించారు. రవినాయుడు మాట్లాడుతూ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు పకడ్బందీగా, పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలన్నారు. ఉద్యోగానికి అర్హత కలిగిన ఏ ఒక్క క్రీడాకారుడు నష్టపోకుండా నిష్పక్షపాతంగా, అవినీతికి తావులేకుండా ఎంపిక జరగాలన్నారు. మెగా డీఎస్సీని అడ్డుపెట్టుకుని ఇప్పటికే కొన్ని స్పోర్ట్స్ అసోసియేషన్లు, ఫెడరేషన్లు దొంగ సర్టిఫికెట్లు ఎరవేసి సొమ్ము చేసుకుంటూ క్రీడాకారుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పోర్ట్స్ అసోసియేషన్ల నిర్వాహకులు ఉద్యోగార్హత కల్పిస్తూ దొంగ సర్టిఫికెట్లు జారీ చేసి లక్షలు కాజేస్తున్నారని అన్నారు. ఇప్పటికే తమ దృష్టికి కొన్ని ఫిర్యాదులు వచ్చాయన్నారు. డీఎస్పీ స్థాయి అధికారితో క్రీడాకారుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. దొంగ సర్టిఫికెట్ల గుర్తింపునకు ప్రత్యేక బృందం పనిచేస్తుందన్నారు. అలాగే ఫోర్జరీ సంతకాలు, దొంగ సర్టిఫికెట్ల జారీకి పాల్పడిన అసోసియేషన్ల అధ్యక్ష కార్యదర్శుల పదవులను రద్దు చేస్తామన్నారు. క్రీడాకారుడు ఏ సంవత్సరంలో ఆడాడో అదే సమయంలో అధ్యక్ష కార్యదర్శులుగా ఉన్నవారి సంతకాలతోపాటు దానికి సంబంధించిన ఆధారాలను కూడా పరిశీలిస్తామన్నారు. జిల్లాస్థాయి కమిటీ దగ్గరే పూర్తిస్థాయిలో అభ్యర్థుల వడపోత జరగాలని ఆదేశించారు. దీనిపై రాష్ట్ర కమిటీ మరింత పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. అధికారులు అలసత్వం వహిస్తే వారిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా అభ్యర్థులకు శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని, భవిష్యత్తులో దొంగ సర్టిఫికెట్లకు తావివ్వకుండా డిజీలాకర్ సిస్టమ్‌ను వాడుకలోనికి తీసుకురావాలని సూచించారు. శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, టీఎస్ఓ ఎస్వీ రమణ, ఎస్ఓలు కోటేశ్వర రావు, మహేష్, సురేంద్ర, కిషోర్, ఏడీలు వేణు, మల్లేశ్వరిభాయ్ పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ దంపతులను 'పేరెంట్స్' అనాలి

తిరువనంతపురం: ట్రాన్స్ జెండర్ దంపతుల బిడ్డ జనన ధ్రువీకరణ పత్రం విషయంలో కేరళ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ట్రాన్స్ జెండర్ జంట తమ పిల్లల జనన ధ్రువీకరణ పత్రంలో తల్లి, తండ్రి అనే వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాల్సిన అవసరం లేదని, పేరెంట్స్ అని రిజిస్టర్ చేస్తే చాలని వెల్లడించింది. కేరళలోని మొట్టమొదటి ట్రాన్స్ జెండర్ జంట దాఖలు చేసిన పిటిషన్ పై కేరళ హైకోర్టు విచారణ జరిపింది. జస్టిస్ జియాద్ రెహమాన్ ఈమేరకు తీర్పుఇచ్చారు. వివరాల్లోకి వెళితే...కోజికోడ్‌కు చెందిన ఓ ట్రాన్స్ జెండర్ జంట బిడ్డ జనన ధ్రువీకరణ పత్రంలో తండ్రి, తల్లి పేర్లను చేర్చారు అధికారులు. ట్రాన్స్ మ్యాన్‌గా మారిన సహద్‌ను తల్లిగా, ట్రాన్స్ ఉమెన్‌గా మారిన జియాను తండ్రిగా పేర్కొన్నారు. ఇది ఆధార్ పత్రాలతో సహా వివిధ విషయాల్లో గందరగోళానికి కారణమవుతుందని ట్రాన్స్ జెండర్ జంట వాదించింది. దీనిని సవరించమని కోజికోడ్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. అందుకు కోజీకోడ్ కార్పొరేషన్ తిరస్కరించింది. దీంతో వారు కేరళ హైకోర్టును ఆశ్రయించారు. పేరెంట్స్ అనే కాలంలో తల్లి, తండ్రి పేర్లను ప్రత్యేకంగా ప్రస్తావించకుండా తమ పేర్లను చేర్చాలనేది వారి డిమాండ్. దీనిని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆమోదించింది.

ప్రజాకాంక్షలు నెరవేరలేదు

- నియంత పాలనతో కీర్తిని కోల్పోయిన కేసీఆర్
- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ఏకైక సీఎం
- తెలంగాణ అవిర్భావ దినోత్సవంలో నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ప్రజలు తమ అసాధారణ పోరాటాలు, అనేక త్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా 10 ఏళ్ల కాలంలో వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ప్రజాకాంక్షలను నెరవేరుస్తామని హామి ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వాటిని పూర్తి చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారు సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ నారాయణ జాతీయ జెండా ఎగురవేయగా, అజీజ్ పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. నారాయణ మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ తన నియంత పాలనతో తన కీర్తిని తానే పోగొట్టుకున్నారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రీయాశీలక పాత్ర పోషించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం ఇవ్వాల్సిందేనని ఒకే మాటపై నిలబడిన ఏకైక జాతీయ పార్టీ సీపీఐ మాత్రమే అని నారాయణ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన హక్కు మాత్రం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని కాని ఆయన దానిని ఈ పదేళ్ల కాలంలో నిలబెట్టుకోలేక పోయారన్నారు. రాష్ట్ర సాధన తర్వాత తెలంగాణ ప్రజలు ఏ ఉద్దేశంతో అయితే కేసీఆర్‌కు అధికారం అప్పగించారో దానిని పూర్తి చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రభుత్వాన్ని, పార్టీని పూర్తిగా అప్రజాస్వామిక పద్ధతుల్లో నియంతృత్వ పాలన కొనసాగించారని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రభుత్వాన్ని, పార్టీని నడిపిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనన్నారు. దీంతో ఆయన సాధించిన కీర్తిని ఆయనే పోగొట్టుకున్నారని చెప్పారు. ఆయన నియంత ధోరణే చివరికి తన కుటుంబంలో కల్లోలం లేపేందుకు కారణమైందన్నారు. ఇదే క్రమంలో కేసీఆర్‌ను గద్దె దించి కాంగ్రెస్‌కు ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని, ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ... కేసీఆర్ పాలనను ఓ గుణపాఠంగా తీసుకుని పరిపాలన కొనసాగించాలని సూచించారు. అధికారం చేపట్టే ముందుకు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేయాలని ఇందుకు సీపీఐ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మరింత కృషి చేయాలని అజీజ్ పాషా సూచించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సీపీఐది అసాధారణ పాత్ర అని, అప్పట్లో రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న డాక్టర్ కె.నారాయణ క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు మరింత వేగవంతంగా అమలు కావాల్సి ఉందన్నారు. తెలంగాణ కులగణన సర్వేతో ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి పెరిగి కేంద్రం సైతం కులగణన చేపట్టాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఓ మైలు రాయేనన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కొంత మేర తీరినప్పటీకి... ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. మూసీ ప్రక్షాళన మంచి కార్యక్రమమేనని, అయితే ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా పని చేయాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటి నరసింహ, సీపీఐ కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, ఎన్.జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యుడు అంజయ్య నాయక్, కె.వి.ఎల్, ఎం.నర్సింహ, కె.కాంతయ్య, సీపీఐ సీనియర్ నాయకులు ఉజ్జని రత్నాకర్ రావు, నాగభూషణం, రాజమౌళి, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కపతం యాదగిరి, స్టాలిన్, వెంకటరెడ్డి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహం హాజరయ్యారు. ప్రజానాట్యమండలి కళాకారులు తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ గీతాలు ఆలపించారు.

ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడింది సీపీఐనే: నారాయణ

నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన తెలంగాణ ఉద్యమంలో అనేకమంది ప్రాణ త్యాగాలు చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. సకల జనుల సమ్మెతోపాటు అనేక పోరాటాలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగాయని, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు ఆంధ్రలో సమైక్యాంధ్ర కోసం పోరాటాలు చేశాయని, ఒక్క సీపీఐ మాత్రం ఆంధ్ర, తెలంగాణాలో 23 జిల్లాలలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. సరూర్ నగర్ ఎస్ఆర్ గార్డెన్స్ లో సోమవారం భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) అధ్వర్యంలో 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. గోపాల్ అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంబడి నడిచిన సీపీఐ నేతలను, కోదండరాంను తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే వారిని పక్కన పెట్టి తన స్వార్థం కోసం తెలంగాణకు బద్ధవ్యతరేకులైన 12 మందికి మంత్రి పదవులు కట్టబెట్టారన్నారు. నేడు పేదల బతుకుల్లో చీకట్లో ఉన్నాయని, వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించాలని సూచించారు. లేకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ... సనాతన ధర్మాన్ని విమర్శించే వారిని జైల్లో పెట్టాలంటున్నాడని, సనాతన ధర్మాన్ని సమర్థించే పవన్ కల్యాణ్‌ను కూడా జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలు గురివిందగింజ సామెతను గుర్తుకు తెస్తుందని ఎద్దేవా చేశారు. ముందు ఎన్నికల హామీలను అమలు చేయడంపై శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. అజీజ్ పాషా మాట్లాడుతూ కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని కొల్లగొట్టి అప్పుల ఊబిలోకి నెట్టేశాడని విమర్శించారు. ఇస్కఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ప్రభాకర్ రావు, ప్రముఖ సంఘ సేవకులు ఎం.. బిక్షపతి గౌడ్, మురళి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యులు ఫైమీద, యువజన నాయకులు ఏండీ మహబూబ్, ప్రముఖ న్యాయవాదులు కె. శ్రీనివాస్, కె. విజయలక్ష్మి, ఇస్కఫ్ నేతలు రజిత, చందు, శ్వేతా, స్వాతి, రఫియా వేదికపై ఆసీనులయ్యారు.

చిరంజీవిని కుమారికి కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర-కాకినాడ: బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ చిరంజీవిని కుమారి అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. అంతకుముందు కాకినాడ, సామర్లకోట రోడ్డులోని ఐడియల్ కళాశాల వద్ద కాలేజి కరస్పాండెంట్ అయిన చిరంజీవిని కుమారి భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అంతిమ యాత్రలో ఆమె అనుచరులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కన్నీళ్లతో అంతిమ వీడ్కోలు పలికారు. చిరంజీవిని కుమారికి నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు పొన్నమామిడి వెంకటేశ్వరరావు, పంతో నానాజీ, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎంపీలు వంగా గీతావిశ్వనాథ్, మీడియం బాబురావు, ఎమ్మెల్సీ పేరా భక్తుల రాజశేఖర్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్న జనార్దన రావు, జేఎన్‌టీయూ వర్సిటీ ప్రతినిధులు ప్రసాద్ రాజు, డాక్టర్ సిలికానిక్ స్టాలిన్, సీపీఐ నాయకులు టి.మధు, కె.కృష్ణారావు, సుంకర విద్యాసాగర్, ముల్లపూడి వీరు తదితరులు ఉన్నారు.

అరసం సంతాపం

విద్య, సాహిత్య రంగాలకు చిరంజీవినీ కుమారి ఎంతగానే సేవ చేశారని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పల్లూరు శివప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘంలో దశాబ్దాల పాటు ప్రగతిశీల సాహిత్యాన్ని అందించారన్నారు. అరసం 8వ రాష్ట్ర మహాసభలను 1978లో ఘనంగా నిర్వహించారన్నారు. శ్రీశ్రీ సప్తతి మహాసభలను కాకినాడలో నిర్వహించారని, తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపకురాలిగా, నిర్వాహకురాలిగా విశిష్ట సేవలు అందించారని వివరించారు. అనువాద ప్రక్రియలో విశేష కృషి చేశారన్నారు. కాకినాడ నగరంలో ఐడియల్ కళాశాలలు స్థాపించి విద్యా వెలుగులను అందించా రన్నారు. అరసానికి అధ్యక్షవర్గ సభ్యురాలిగా... వివిధ బాధ్యతలు నిర్వర్తించడం సదా స్మరణీయమన్నారు. ఆమె మృతికి సంతాపం... కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

వారం రోజులు వేడి గాలులే!

రుతుపవనాల మందగమనం: మళ్లీ పుంజుకునేది జూన్ 11 నాటికే

ముంబై: రుతుపవనాల పురోగతి నిలిచిపోయినందున దేశంలో వారం రోజుల పాటు వర్షాలు తగ్గుముఖం పట్టనున్నాయి. అయితే జూన్ 11 నుంచి మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని ఇద్దరు సీనియర్ వాతావరణ బ్యూరో అధికారులు సోమవారం తెలిపారు. దేశ దాదాపు 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు జీవనాడి అయిన రుతుపవనాలు, వ్యవసాయ భూములకు సాగునీటిని, జలాశయాలను నింపడానికి భారతదేశానికి అవసరమైన వర్షపాతంలో దాదాపు 70 శాతం అందిస్తాయి. నీటిపారుదల లేని దేశంలోని దాదాపు సగం వ్యవసాయ భూమి పంటల సాగు కోసం వార్షిక జూన్-సెప్టెంబరు వర్షాలపై ఆధారపడి ఉంటుంది. రాబోయే కొన్ని రోజుల్లో రుతుపవనాల వర్షపాతం తగ్గుతుంది. కానీ జూన్ 11-12 నుంచి రుతుపవనాలు బలపడి దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో వ్యాపించడం ప్రారంభిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) పూణే కార్యాలయం శాస్త్రవేత్త ఎస్.డి.సనప్ పేర్కొన్నారు. మే 24న కేరళలో రుతుపవనాలు ప్రారంభమై దక్షిణ, ఈశాన్య, పశ్చిమ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలను సాధారణ సమయం కంటే ముందే త్వరగా వ్యాపించాయి. అయితే గత కొన్ని రోజులుగా దాని పురోగతి నిలిచిపోయిందని రుతుపవనాల పురోగతిని పరిశీలిస్తున్న ఐఎండీ చార్ట్ పేర్కొంది. జూన్ 11న బంగాళా ఖాతంలో వాతావరణ వ్యవస్థ అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ఇది రుతుపవనాలను బలోపేతం చేస్తుందని, దేశంలోని ఉత్తర ప్రాంతాలలో దాని పురోగతికి అనుకూలమైన పరిస్థితులను సృష్టిస్తుందని వాతావరణ శాఖకు చెందిన మరొక అధికారి తెలిపారు.

సైనిక శిబిరంపై కొండచరియలు

ముగ్గురు భద్రతా సిబ్బంది మృతి... ఆరుగురి గల్లంతు

గ్యాంగ్‌టక్: ఈశాన్య భారతంలో వర్షాలు బెంబేలెత్తిస్తున్నాయి. సిక్కిం లోని ఛటేన్‌లో సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు భద్రతా సిబ్బంది మృతిచెందగా... ఆరుగురి జాడ గల్లంతైంది. ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో భారీగా వర్షాలు కురియడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు రక్షణ శాఖ అధికారి ఒకరు సోమవారం ప్రకటన చేశారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టామని, ఇంతవరకూ మూడు మృతదేహాలను వెలికి తీశామని సదరు అధికారి వెల్లడించారు. నలుగురికి స్వల్ప గాయాలయినట్టు చెప్పారు. జాడగల్లంతైన ఆరుగురి కోసం గాలిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సిక్కింలో గత వారం రోజులుగా ఎడతెగని వర్షాలు కురుస్తుండటంతో కొండచరియలు విరిగిపడుతున్నాయి. తీస్తా నది ప్రమాదకర స్థాయి దాటి ప్రవహిస్తుండటంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అప్రమత్తం చేశారు. నార్త్ సిక్కింలోని తీంగ్, చుంగ్‌తాంగ్‌లో కొండచరియలు విరిగిపడటంతో కొన్ని రోడ్లు మూసివేశారు. కాగా, అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయాలోనూ భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అసోంలోని ప్రధాన నదులు ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో 20కి పైగా జిల్లాల్లో వరదనీటితో ప్రజలు ఇక్కట్లుపడుతున్నారు. నైరుతి రుతుపవనాలు రావడంతో అత్యధిక వర్షపాతం అరుణాచల్ ప్రదేశ్‌లో నమోదయినట్టు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం అవసరమైన సహాయక చర్యలు చేపడుతోందని చెప్పారు.

టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట

హోం మంత్రి అనిత

విశాలాంధ్ర- విజయవాడ (క్రైం): టెక్నాలజీ ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. అధికారుల గదులు, సెంట్రీ, రిసెప్షన్, మహిళా హెల్ప్ డెస్క్‌లతో పాటు సీడీఆర్ అనాలసిస్, సైబర్ క్రైం సీసీటీఎన్ఎస్, ఎల్‌హెచ్ఎంఎస్, ఫేషియల్ రికగ్నిజేషన్ కెమెరా విభాగాలను, సిబ్బంది కోసం జిమ్, పిల్లల కోసం ప్రత్యేకమైన ప్లేరూమ్‌లను ఏర్పాటు చేశారు. అనిత మాట్లాడుతూ టెక్నాలజీ అందిపుచ్చుకోవడంలో ఏపీ పోలీసులు ముందున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు దీటుగా మోడల్ పోలీస్ స్టేషన్‌లు ఇకపై నిర్మిస్తామన్నారు. హాట్ స్పాట్‌లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత అవసరమన్నారు. ఎన్టీఆర్ జిల్లా డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాలను అరికట్టవచ్చన్నారు. నేరస్తులకు భయం కలిగేలా ఏపీ పోలీసుల పనితీరు ఉందన్నారు. విజయవాడలో గంజాయి, బ్లేడ్‌బ్యాచ్‌లకు పోలీసులు చెక్ పెట్టారన్నారు. నేరం జరిగిన 24గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నారన్నారు. అది ఇన్విజిబుల్ పోలీసింగ్‌తో సాధ్యం అవుతోందన్నారు. గంజాయి నిర్మూలనలో ఈగల్ టీమ్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ శాంతిభద్రల పర్యవేక్షణలో పోలీసుశాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్‌లను టెక్నలాజికల్‌గా తీర్చిదిద్దుతున్నా మన్నారు. నేరం చేయాలంటే భయపడేలా పోలీసులు పని చేస్తున్నారన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని); డీజీపీ హరీశ్‌గుప్తా, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, డీసీపీ సరిత, తిరుమల్లేశ్వరరెడ్డి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఎస్‌వీడీ ప్రసాద్, మా అర్ట్స్ రవికుమార్, సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.